ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

మార్చి 2010
వెల : రూ. 10

శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయరత్నదీపమ్ ।

సురభి

నేను (రాస్ బిహారి – స్వామి అరూపానంద) : అమ్మా! కాశీలో మరణించే వారందరూ ముక్తిపొందుతారా?

మాతృదేవి : పొందుతారనే శాస్త్రాలు వచిస్తున్నాయి.

నేను : మీ ప్రత్యక్ష అనుభవం ఏమిటి? మరణించిన వారికి సాక్షాత్తూ పరమ శివుడే తారకమంత్రాన్ని ఉపదేశిస్తున్నట్లు గురుదేవులు దర్శించారు.

మాతృదేవి : నా కేమీ దాని గురించి తెలియదు నాయనా! అలాంటిదేమీ నేను చూడలేదు.

నేను:మీ ముఖతా వినకుంటే నాకు నమ్మకం కుదరదు.

మరునాడు మాతృదేవి తనకు కలిగిన దివ్యదర్శనం గురించి ఇలా వివరించారు : “నిన్న రాత్రి హఠాత్తుగా బృందావనంలోని ‘సేథ్’ ఆలయంలోని నారాయణుని ప్రతిమ నా పక్కన నిలబడి ఉండడం చూశాను. ఆయన సమక్షంలో గురుదేవులు చేతులు జోడించుకొని నిలబడి వున్నారు. ‘గురుదేవులు ఇక్కడకు ఎలా వచ్చారు?’ అనుకొన్నాను. తరువాత ‘కాశీలో మరణించే వారు ముక్తి పొందుతారు అన్న సత్యాన్ని రాస్ బిహారీ నమ్మనంటున్నాడు’ అని చెప్పాను. అందుకు గురుదేవులు, ‘నమ్మక ఏం చేస్తాడు? ఇదంతా నిజం” అని చెప్పారు.

నేను : ఇక్కడ మరణించే వారు ముక్తి పొందుతారని నిజంగానే చెబుతున్నారా?

మాతృదేవి (కాస్త కోపంగా) : నీ కోసం మూడుసార్లు ప్రమాణం చేసి చెప్పలేను. ఒకసారి ప్రమాణం చేయడమే మంచిది కాదు. ఇక మూడుసార్లా, అదీ కాశీ క్షేత్రంలో!

నేను (నవ్వి) : అమ్మా! నాకు కాశీలో మరణం రాకుండా చూడండి. ఎందుకంటే మిమ్మల్ని వదిలి నేను దూరంగా ఉండలేను.

మాతృదేవి (నవ్వుతూ) : ఏం చెబుతున్నాడు వీడు – కాశీలో మరణించడానికి ఇష్టపడడట!

నేను : భక్తులకు ముక్తి తథ్యం. భక్తులు కానివారికీ, ఇతర మతస్థులకీ ముక్తి లభిస్తుందా, లేదా?

మాతృదేవి : వారికీ లభిస్తుంది. కాశీ దివ్యచైతన్యంతో విరాజిల్లే స్థలం. ఇక్కడి క్రిమి కీటకాదులతో సహా సకల ప్రాణికోటి దివ్యచైతన్యవంతమైనవి. భక్తుడు, భక్తుడు కానివాడు, పరాయి మతస్థుడు, క్రిమి కీటకాదులతో సహా ఇక్కడ మరణించే ఎవరికైనా సరే ముక్తి తథ్యం. ❖

(స్వామి అరూపానంద స్మృతుల నుంచి)

With Best Compliments From

CHAIRMAN & MANAGING DIRECTOR

THE KCP LIMITED

KCP కంపెనీ వారు ‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 67 | సంచిక: 3 | మార్చి 2010

ఓం ఆ నో భద్రా క్రతవో యంతు విశ్వతోఽదబ్ధాసో అపరీతాస ఉద్భిదః ।
దేవా నో యథా సదమిద్ వృధే అసన్నప్రాయువో రక్షితారో దివేదివే ॥

మంగళదాయకమైన ఆలోచనలు అన్ని వైపుల నుండి
వచ్చి మమ్మల్ని చేరుగాక! దేవతలు సర్వదా మనకు
సుఖాన్ని పెంపొందించేవారుగా, మనలను
పరిరక్షించేవారుగా ఉందురుగాక!

(ఆ నో భద్రాః సూక్తమ్)

లోపలి పేజీల్లో...

4
సంపాదకీయం
రమణీయ రాజ్యం రామరాజ్యం

11
దేవీ వైభవం

6
గోరుముద్ద
ఇంగితజ్ఞానం

13
ధీరవాణి
భారత స్త్రీత్వానికి ఆదర్శం-సీత

7
శ్రీరామచంద్రునిగా శ్రీరామకృష్ణులు

14
పరిప్రశ్న

8
ఉగాది సందేశం

15
అమరధామానికి సేతువు

9
పరమేశ్వరుని పరిరక్షణలో...
చంద్రనాథ్‌లో స్వర్ణమృగం



16
బొమ్మల కథ
సీతాదేవి జన్మ రహస్యం



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు........... రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................ రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు	చిరునామా	రూ.
మహారాజ పోషకులు	:	శ్రీ ఎమ్. శ్రీకాంత్ & శ్రీమతి శశికళ, శ్రీకాకుళం	15,000
మహారాజ పోషకులు	:	శ్రీ కృష్ణ ప్రసాద్, బళ్ళారి, కర్ణాటక - 583 101	10,001
మహారాజ పోషకులు	:	శ్రీమతి ఎస్. మాధవి కె.పి, బళ్ళారి, కర్ణాటక - 583 101	10,001
రాజపోషకులు	:	కుమారి ఎన్. మధు నిర్మల, కొత్తగూడెం, ఖమ్మం జిల్లా (కీ॥శే॥ నండూరి రాజరాజేశ్వరి జ్ఞాపకార్థం)	5,000
పోషకులు	:	శ్రీ బి. దామోదర్, విజ్ఞాన్‌పురి, విద్యానగర్, హైదరాబాద్ - 500 044	1,116
పోషకులు	:	శ్రీ నంగునూరి రాజం, ఎల్.బి.నగర్, హైదరాబాద్ - 500 074	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ. / డి.డి./ చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో

అధ్యక్షులు

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు		ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	:	రూ. 10	-
ఒక సంవత్సర చందా	:	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

18 ఆచారవ్యవహారాలు-అంతరార్థాలు
అన్నిటికీ అవసరమైన తులసి

19 రామభక్తుడు త్యాగరాజు

20 ఓ మహాత్యాగి ఆత్మకథ
(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

22 ప్రాచీన గాథలు : జీవన వికాసం
ఆదర్శ పురుషుడు ఆ జానకీ రాముడు

24 యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

25 ఇబ్బందులు ఉపాయాలు

26 తడబడుతున్న తరుణి అడుగులు

28 అల్పంలోనే ఆనందం

29 ముందుకు సాగిపో!

31 మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు
పెద్ద మనస్సు

33 నా జీవితంలో స్వామి వివేకానంద
వివేకానందునిపై పరిశోధనతో డాక్టరేట్!


35 ఆపాల్సిన పరుగుపందెం

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకు కుడి భాగంలో మీ చందా గడువు ముగిసే నెల వ్రాసి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకోండి. 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.

- సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

రమణీయ రాజ్యం రామరాజ్యం

యుగాలు మారినా మానవుల హృదయమందిరాల్లో సదా ప్రతిధ్వనించే తారక నామం – శ్రీరామనామం. రాజులు గతించినా, రాజ్యాలు అంతరించినా రాజంటే రాముడేననీ, రాజ్యమంటే రామరాజ్యమేననీ ప్రతీతి. ఈనాటికీ రాముణ్ణి ఆదర్శ ప్రభువుగా, అయోధ్యను ఆదర్శ రాజ్యంగా భావిస్తున్నాం. అందుకు కారణం – రాముడు సకల సద్గుణ శోభితుడై రాజ్యాన్ని పాలించడం, రామరాజ్యంలోని ప్రజలు కూడా ధర్మవర్తనులై జీవించడమే!

'పుంసాం మోహన రూపాయ...' అని శ్రీరాముణ్ణి కీర్తిస్తాం. అయితే, ఇన్ని యుగాలుగా రాముణ్ణి ఆరాధించడానికి కారణం కేవలం ఆయన బాహ్యసౌందర్యం చూసి కాదు, అంతః సౌందర్యానికి (సుగుణాలకు) ప్రభావితులమై అన్న విషయాన్ని విస్మరించరాదు. శ్రీరాముని సుగుణ కుసుమాల పరిమళాలు నేటికీ వెదజల్లుతున్నాయంటే వాటి ప్రభావం ఎంతటి మహత్తరమైనదో మనం ఊహించవచ్చు.

రామరాజ్యం – రావణరాజ్యం : ప్రజలు రాజుకు దేహం లాంటివారు, ప్రజలకు రాజు ఆత్మ లాంటివాడు. పాలకులూ, ప్రజలూ సత్యధర్మ మార్గాలను అనుసరించినప్పుడే దేశం సుభిక్షంగా, శాంతిమయంగా ఉండగలదని మహాభారతంలోని శాంతిపర్వంలో భీష్ముడు సూచించాడు.

'యథా రాజా తథా ప్రజా!' అని లోకోక్తి. 'ప్రభువులు ఎలా ప్రవర్తిస్తే ప్రజలు కూడా అలాగే ప్రవర్తిస్తారు'అన్న మాట నిజమని నిరూపించే రాజ్యాలు – రామరాజ్యం, రావణరాజ్యం. సత్యధర్మాలు జీవితానికి శోభనూ, శాంతినీ ఇచ్చేవి అని ఋజువు చేశాడు రాముడు. రామరాజ్యంలో ప్రజలు ఎలా శాంతిసౌఖ్యాలతో వర్ధిల్లారో 'అధ్యాత్మ రామాయణం'లో ఇలా వివరించబడింది :

'రామరాజ్యంలో వ్యాధుల భయం, దొంగల భయం లేవు. వృద్ధులు, సత్పురుషులు, బాలలకు అకాల మృత్యు భయం లేదు. ప్రజలకు ఎలాంటి అనర్థాలూ కలగలేదు. అందరూ రాముణ్ణి పూజించి, సదా ఆయన చింతనలో జీవించారు'.

కాగా, అసత్య, అధర్మాలు జీవితానికి క్షోభనూ, అశాంతినీ కలుగజేస్తాయని రావణుని జీవితం తెలియజేస్తుంది. రావణరాజ్యంలో హింసలూ, దొంగతనాలూ, అకాల మరణాలూ, అరాచకాలూ తాండవించాయి.

అకృతాత్మాన మాపాద్య రాజాన మనయే రథమ్ ।
సమృద్ధాని వినశ్యంతి రాష్ట్రాణి నగరాణి చ ॥

'నీతి హీనుడూ, ఇంద్రియ చపలుడూ అయిన రాజు యొక్క సంపదలూ, రాజ్యాలూ నశించిపోతాయి'.

రావణుడు సీతను అపహరించి ఇంద్రియలోలుడిగా పేరుబడ్డాడు. రావణుడు అధర్మవర్తనుడు అవడం వల్ల సకల ఐశ్వర్యాల్నీ, రాజ్యాన్నీ కోల్పోయాడు.

ప్రభువు, ప్రజలు నీతిబద్ధులై అన్యోన్యంగా జీవించినప్పుడే 'రామరాజ్యం' సాధ్యమవుతుంది. రామరాజ్యంలోని ప్రజలు, ప్రభువులు ఎలాంటి ఉన్నత లక్షణాలు కలిగి ఉండేవారో తెలుసుకుందాం:

సద్గుణవంతులకే సమున్నత స్థానం : రాముణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేయడానికి దశరథ మహారాజు అయోధ్యవాసుల అభిప్రాయాన్ని అడిగినప్పుడు ప్రజలంతా ముక్త కంఠంతో 'రాముడు ఆహ్లాదాన్నిచ్చే చంద్రుని లాంటివాడు, సహనంలో భూదేవికి సమానుడు, బుద్ధిలో బృహస్పతి వంటివాడు' అని రాముణ్ణి కీర్తించారు.

వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః ।
ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి ॥

'రాజా! మాకు కష్టాలు కలిగితే రాముడు బాధపడతాడు. సుఖం కలిగితే పిల్లల సంతోషం చూసి తండ్రి ఆనందించినట్లు ఆనందిస్తాడు' అని అన్నారు. రాముడు రాజైతే తమకు సకల సౌఖ్యాలూ చేకూరుతాయని అయోధ్య ప్రజలు తమ విశ్వాసాన్ని వ్యక్తపరిచారు.

పరిపాలించే రాజు ఎలా ఉండాలన్న విషయంపై అయోధ్య ప్రజలకు పూర్తి అవగాహన ఉందని దీన్నిబట్టి మనకు అర్థమవుతుంది. మరి ఈనాటి ప్రజలు ఎలాంటి పాలకుల్ని ఎన్నుకుంటున్నారో, అందుకు ఎలాంటి మార్గాల్ని అనుసరిస్తున్నారో అందరికీ తెలిసిన విషయమే! కాబట్టి అందరి హితం కోసం కృషి చేసే వారిని పాలకులుగా ఎన్నుకోవడంలో ప్రజలు అవగాహన కలిగిఉండాలి.

వినయ విధేయతలతో అధికార వినియోగం: అయోధ్య ప్రజలంతా రాముణ్ణి సకల సుగుణాల రాశి అని కీర్తించారు. కానీ దశరథ మహారాజు మాత్రం వినయ స్వరూపుడైన

శ్రీరామునికి ఇంకా వినయ విధేయతలతో ప్రవర్తించాల్సిందంటూ ఇలా హితబోధ చేశాడు:

భూయో వినయ మాస్థాయ భవ నిత్యం జితేన్ద్రియః ।
కామక్రోధ సముత్థాని త్యజేథా వ్యసనాని చ ॥

'ఓ రామా! వినయాన్ని పెంచుకో, ఇంద్రియాలను అధీనంలో ఉంచుకో, కామక్రోధాల వల్ల ఉత్పన్నమయ్యే వ్యసనాలకు దూరంగా ఉండు'.

అధికారం ఎంతటి వారిలోనైనా గర్వాన్ని పెంచుతుంది, దుర్వ్యసనాలకు లోబడేలా చేస్తుంది. అధికారంలో ఉన్నప్పుడు కూడా వినయంతో వ్యవహరించాలని సకల సుగుణాభి

రాముడికే హితబోధ చేసినప్పుడు మరి నేటి పాలకులు, ఉన్నత అధికారులు ఎంత అప్రమత్తతతో వ్యవహరించాలో ఆలోచించాల్సిన విషయం.

సర్వావస్థల్లోనూ సానుకూల దృక్పథం : పట్టాభిషేక వార్త విన్నప్పుడు రాముడు సంతోషంతో పొంగిపోలేదు. పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేయాలన్నప్పుడు దుఃఖంతో క్రుంగిపోలేదు. అంతేకాక, పితృవాక్య పరిపాలనకై వనవాసం చేయడం సదవకాశమనీ, సత్పురుషుల సాంగత్యం లభిస్తుందనీ ఆనందించాడు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంతో ఆలోచించగలిగే మహోన్నత వ్యక్తిత్వం రాముడిది.

పదోన్నతి రాకపోయినా, పదవీచ్యుతులు అయినా మనస్తాపానికి గురయ్యే వారికి శ్రీరాముని ధీరత్వం, సమచిత్తం, సానుకూల దృక్పథం మార్గదర్శకాలు.

ప్రజల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం : అరణ్యవాసానికి వెళ్ళిన రాముణ్ణి ఎలాగైనా ఒప్పించి తిరిగి అయోధ్యకు తీసుకురావాలని రాముని దగ్గరకు భరతుడు వెళ్ళినప్పుడు, భరతుణ్ణి మొట్టమొదట అయోధ్య ప్రజల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నాడు రాముడు.

స్నేహం దయాం చ సౌఖ్యం చ యది వా జానకీ మపి ।
ఆరాధనాయ లోకస్య ముంచ తో నాస్తి మే వ్యథా ॥

'ప్రజల సంక్షేమానికై స్వీయ సుఖాలనూ, మమతానురాగాలనూ, చివరకు నా భార్య అయిన సీతను సైతం విడిచిపెట్టడానికి సంకోచించను' అని ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని నిరూపించాడు శ్రీరాముడు.

'పేరు ప్రఖ్యాతుల్నీ, ఆస్తి అంతస్తుల్నీ మరచి ప్రజల కోసం అహర్నిశలూ పరితపించినవాడు, అవసరమైతే ప్రాణాల్ని అర్పించడానికి సైతం సంకోచించనివాడు మాత్రమే నిజమైన దేశభక్తుడు' అంటారు స్వామి వివేకానంద.

రామరాజ్య స్థాపనకు సరైన మార్గం : ఏ దేశమైనా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలంటే ముఖ్యంగా కావలసింది ఏమిటి? ఒకసారి రఘుమహారాజు దేశం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ఎలాంటి పథకాల్ని అవలంబించాలో చర్చించడానికి మేధావుల సభ ఏర్పాటుచేశాడు. ఆ సభలో ఒక వర్గం వారు దేశం అభివృద్ధి చెందడానికి సైన్యం పటిష్ఠంగా ఉండాలన్నారు. అందుకు అవసరమైన పథకాలు చేపట్టాలని సూచించారు. రెండో వర్గం వారు దేశం శాంతి సౌఖ్యాలతో వర్ధిల్లాలంటే దేశ ప్రజలు సచ్ఛీలురై ఉండాలన్నారు. ప్రజల్ని శీలవంతులుగా తీర్చిదిద్దడానికి అవసరమైన పథకాలను చేపట్టాలని సూచించారు. అప్పుడు రఘుమహారాజు శీలవంతులైన ప్రజలు రాజ్యానికి దృఢమైన కోట లాంటివారు. కాబట్టి దేశం శాంతి సౌఖ్యాలతో వర్ధిల్లాలంటే ప్రజల్ని శీలవంతులుగా, సంస్కారవంతులుగా తీర్చిదిద్దడమే మార్గమని తీర్మానించుకున్నాడు.

కాబట్టి ఏ దేశమైనా శాంతి సౌభాగ్యాలతో విరాజిల్లాలంటే ఆ దేశంలో ఎన్ని ఠాణాలు, ఎన్ని న్యాయస్థానాలు, సైనిక బలగాలు ఉన్నాయనికాదు, ఎంతమంది సచ్ఛీలురూ, సద్గుణ వంతులూ ఉన్నారన్న దానిపై ఆధారపడి ఉంటుందని గ్రహించాలి. ప్రభుత్వం, పాలకులు రఘుమహారాజు సూచనల్ని ఆచరణాత్మకం చేయడానికి ప్రయత్నించాలి.

'రామరాజ్యం' మళ్ళీ రావాలంటే పాలకులు శ్రీరాముని లాంటి సద్గుణవంతులు, ప్రజలు అయోధ్యవాసుల లాంటి శీలవంతులు కావాలి. అప్పుడే మన రాజ్యం రమణీయ రాజ్యంగా మారుతుంది. ❖

ఇంగితజ్ఞానం

ఇంగితజ్ఞానం (common sense) అంటే ఏమిటి? ఇంగితజ్ఞానం గురించి చెబుతూ 'భక్తుడివైనంత మాత్రాన మూర్ఖుడివి కాకూడదు' అని అంటారు శ్రీరామకృష్ణులు. ఒక శిష్యుడు బజారుకు వెళ్ళి మూకుడు ఒకటి కొనుక్కొస్తాడు. దానికి పగులు ఉండడం చూసిన శ్రీరామకృష్ణులు శిష్యునికి చీవాట్లు పెడతారు. అప్పుడు ఆ శిష్యుడు 'దుకాణం యజమాని నామాలు పెట్టుకుని కూర్చున్నాడు అందువల్ల అతడు భక్తుడనుకున్నాను. కానీ అతడు మోసం చేస్తాడనుకోలేదు' అని సమాధానం చెప్పాడు. రామకృష్ణులు మననుంచి కోరుకునేది 'ఇంగితజ్ఞానం'.

ఈ కాలంలో సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ అనే మాటలు వింటున్నాం. సాఫ్ట్ స్కిల్స్ అంటే ఏమిటని ఒకతణ్ణి అడిగితే 'గుడ్‌మార్నింగ్, థాంక్యూ' అని చెప్పడం అన్నాడు. 'మన ఇంటికి ఎవరైనా వస్తే ముందు కూర్చోమనాలి... పెద్దల ఎదుట కాలు మీద కాలు వేసుకుని కూర్చోకూడదు...' అని అమ్మ మనకు చెప్పేది. కానీ ఈ రోజుల్లో వీటిని నేర్చుకోవడం కోసం సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది. అందుకు కారణం ఇంట్లో తల్లితండ్రులు ఇంగిత జ్ఞానం గురించి పిల్లలకు చెప్పకపోవడమే!

అయితే మనం పిల్లలకు 'ఎప్పుడూ నిజం చెప్పాలి' అని చెబుతాం. కానీ నిజం చెప్పకపోతే కలిగే నష్టాలేమిటి, చెబితే వచ్చే లాభాలేంటి అన్న విషయం వారికి వివరించం. 'అందరూ ఎలా ఉండాలో చెబుతారు, ఏం చేయాలో చెబుతారు కానీ ఎందుకు చెయ్యాలో చెప్పరు' అని అంటారు స్వామి వివేకానంద.

ఇంగితజ్ఞానంలో అనేక అంశాలు ఉన్నాయి. అందులో 'ప్రేమ' అనే విషయాన్ని గురించి చూద్దాం :

తరగతి గదిలో ఒక విద్యార్థిని ఉపాధ్యాయురాల్ని 'ప్రేమ' అంటే ఏమిటి అని అడిగింది. అప్పుడు ఆ ఉపాధ్యాయురాలు అందుకు ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచించి పిల్లలందర్నీ బయటకు వెళ్ళి మీకు ప్రేమను కలిగించేదేదో దాన్ని తీసుకురమ్మని చెప్పింది. విద్యార్థులు ఒక్కొక్కరు తమకు నచ్చిన పువ్వులూ, వస్తువులు తీసుకొనివచ్చారు. "టీచర్! నాకు ఈ గులాబి పువ్వు అంటే ఎంతో ఇష్టం"అని ఒకరు, నాకు "ఫలానా పక్షి అంటే ఇష్టం"అని మరొకరు ఇలా విద్యార్థు లందరూ తమకు ఇష్టమైన వాటి గురించి చెప్పసాగారు. అందులో ఒక విద్యార్థిని మాత్రం ఏమీ తీసుకురాలేదు, మాట్లాడకుండా కూర్చుంది. అప్పుడు టీచర్ ఆ విద్యార్థినిని 'నువ్వు ఏమీ తీసుకురాలేదా, నీలో ప్రేమను కలిగించిన వస్తువేదీ లేదా' అని అడిగింది. అప్పుడు ఆ అమ్మాయి "టీచర్! నేను ఒక పువ్వును చూశాను. అది చాలా అందంగా ఉంది. ఎంతో సువాసన వెదజల్లుతోంది. కానీ దాన్ని కొమ్మ నుంచి తుంచితే దాన్నుంచి నేను మాత్రమే ఆనందాన్ని పొందగలను. మిగతా ఎవరూ కూడా ఆ పువ్వు అందాన్ని చూడలేరు, దాని సువాసనను ఆస్వాదించలేరు కదా! అందుకని నేను తీసుకు రాలేదు".

"తరువాత ఒక పక్షి పిల్లను చెట్టు కింద చూశాను. దాన్ని తీసుకువద్దామని వెళ్ళేసరికి కొమ్మమీద తల్లి పక్షి దీనంగా చూస్తూ కనబడింది. అప్పుడు ఆ పక్షిపిల్లను అక్కడే వదిలి వస్తుంటే ఆ పక్షి నావైపు ఎంతో ఆదరంతో చూసింది. ఆ పక్షి ఆనందాన్ని చూసినప్పుడు నాలో ఎంతో ఆనందం కలిగింది. కానీ ఆ ఆనందాన్ని మీకు ఇవ్వలేను కదా, దాన్ని చూపించలేను కదా" అని అన్నది.

ప్రేమ అనేది ఒక అనుభూతి. మనం ఇతరులను ప్రేమించినప్పుడే దాని విలువ తెలుస్తుంది.

ఈ ప్రేమ అనే సాఫ్ట్‌వేర్‌ను మన హృదయాల్లో నెలకొల్పినప్పుడే ఇంగితజ్ఞానంతో వ్యవహరించగలం. అప్పుడే ఏ పనిలోనైనా నైపుణ్యాన్ని సాధించగలం. ❖

శ్రీరామచంద్రునిగా శ్రీరామకృష్ణులు

- స్వామి జ్ఞానదానంద

ఒకసారి క్షుదీరామ్ పువ్వులు సేకరించి, మాల కట్టి, రఘువీరుణ్ణి పూజించడానికి కూర్చున్నాడు. ఆయన దేవతా ప్రతిమకు అభిషేకం చేసి, ధ్యానం చేసుకుంటున్నప్పుడు గదాధర్ (శ్రీరామకృష్ణుని బాల్య నామం) ఆ మాలను తన మెళ్ళో వేసుకొన్నాడు. తరువాత తండ్రిని పిలిచి ఇలా అన్నాడు : "చూడు నాన్నా! నేను రఘువీరుణ్ణి. ఆయనలాగే పూలమాలను ఎలా ధరించానో చూడు!"

భైరవీ బ్రాహ్మణి తంత్రశాస్త్రం ప్రకారం శాక్త్యోపాసనలో పరిపూర్ణత్వాన్ని సంతరించుకొంది; వైష్ణవమత ప్రతిపాదితమైన భక్తిమార్గంలో ఆమె గొప్ప సాధకురాలు; కానీ ఆమె సదా రఘువీరుడి సాలగ్రామాన్ని తనతోబాటు ఉంచుకొనేది.



ఒకసారి భైరవీ బ్రాహ్మణి పంచవటిలో వంట చేసి, వండిన వంటకాలను రఘువీరుడి ముందు అమర్చిపెట్టి, కళ్ళు మూసుకొని తన ఇష్టదేవతను ధ్యానించసాగింది. కాసేపటికి ఆమె బాహ్య చైతన్యాన్ని కోల్పోయింది. ఆ స్థితిలో ఆమెకు ఒక అద్భుత దర్శనం కలిగింది. సరిగ్గా అదే సమయంలో భావపారవశ్య స్థితిలో ఉన్న గురుదేవులకు పంచవటికి వెళ్ళాలన్న అంతఃప్రేరణ కలిగింది. వెంటనే ఆయన పంచవటికి వెళ్ళి ఆ భావపారవశ్య స్థితిలో భైరవీ బ్రాహ్మణి రఘువీరుని కోసం అర్పించిన నైవేద్యాన్ని ఆరగించ నారంభించారు. కాసేపటికి భైరవీ బ్రాహ్మణికి బాహ్యస్పృహ కలిగి కళ్ళు తెరిచి చూసింది. శ్రీరామకృష్ణులు భావపారవశ్య స్థితిలో నైవేద్యాన్ని ఆరగిస్తున్న దృశ్యం కంటపడింది. ఆ దృశ్యమూ, తాను గాంచిన దివ్యదర్శనమూ ఒక్కటే కావడం చూసి ఆమె ఆనందపరవశురాలయింది; ఆమెకు రోమాంచితమయింది. గురుదేవులు మామూలు స్థితిలోకి వచ్చాక తను చేసిన పనికి సిగ్గుపడ్డారు. "నన్ను నేను అదుపులో ఉంచుకోలేక ఎందుకు ఇలాంటి పనులు చేస్తానో ఎవరి కెరుక అమ్మా?" అన్నారు క్షమాపణ చెప్పుకొంటున్న ధోరణిలో.

తల్లి లాగ భైరవి, ఆయనను అనునయిస్తూ ఇలా చెప్పింది: "నువ్వు మంచి పనే చేశావు నాయనా! నిజానికి ఇది నీ పని కాదు. నీలో ఉన్న వాడి పని. దీనిని ఎవరు చేశారో, ఎందుకు చేశారో ధ్యానంలో నాకు స్పష్టంగా తెలిసింది. ఇక మీదట బాహ్యపూజ చేయవలసిన అవసరం లేదని నాకు అవగతమయింది. ఇంత కాలానికి నా పూజ సఫలమయింది." అలా చెప్పి భైరవీ బ్రాహ్మణి ఎలాంటి సంకోచమూ లేకుండా శ్రీరామకృష్ణుల ఉచ్ఛిష్టాన్ని భగవత్ప్రసాదంగా స్వీకరించింది. తన ఇష్టదైవం రఘువీరుణ్ణి, శ్రీరామకృష్ణులలో సజీవంగా చూసి ఆమె పరమానందభరితురాలయింది. కళ్ళ నుంచి ఆనందబాష్పాలు ప్రవిస్తూ ఉండగా, ఎంతో కాలం నుంచి భక్తితో పూజిస్తున్న ఆ రఘువీరుడి సాలగ్రామ శిలను గంగార్పణం చేసింది.

నవగోపాల్ ఘోష్ భార్య అయిన నిస్తారిణి భర్తతో కలిసి గురుదేవుల దర్శనార్థం దక్షిణేశ్వరానికి వెళ్ళింది. ఆమె భక్తి పరాయణురాలు. ఆమె ఇష్టదైవం శ్రీరామచంద్రుడు. "జగజ్జనని కరుణతో నీకు అంతా మంచి జరుగుతుంది, నీ ఇష్టదైవం దర్శనం కలుగుతుంది" అని గురుదేవులు ఆమెను ఆశీర్వదించారు. ఒక రోజు మంత్రం జపిస్తూ ఉన్నప్పుడు ఆమెకు శ్రీరామచంద్రుని దర్శనం కలిగింది. వెంటనే ఆమె తల వంచి నమస్కరిస్తున్నప్పుడు రామచంద్రుని స్థానంలో ఆమెకు శ్రీరామకృష్ణులు కనిపించారు. అప్పుడు గురుదేవులు నవ్వి, "ఇప్పుడు నేనెవరో నీకు తెలిసిందనుకొంటాను" అన్నారు. ❖

ఉగాది సందేశం

ఉగస్య ఆదిః ఉగాదిః - 'ఉగ' అంటే నక్షత్రపు నడక. నక్షత్రాలు నడక ఆరంభించిన (అంటే సృష్టి ప్రారంభమైన) కాలపు ఆది 'ఉగాది' అయింది.

చాంద్రమానం ప్రకారం చైత్ర శుద్ధ పాడ్యమి నాడు ఉగాది వస్తుంది. ఉగాది పుట్టుకకు అనేక పౌరాణిక, చారిత్రక కథలున్నాయి. వేదాలను అపహరించిన సోమకుడి బారి నుండి వేదాలను కాపాడి, బ్రహ్మకు అప్పగించడానికి శ్రీమహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించింది చైత్ర శుద్ధ పాడ్యమి నాడే అని ఒక పురాణ గాథ ఉంది. విక్రమార్క చక్రవర్తి ఆ రోజే పట్టాభిషిక్తుడైనట్లు చరిత్ర చెబుతోంది.

చైత్ర మాసం నుండి వసంత ఋతువు మొదలవుతుంది. ఈ కాలంలో చెట్లు చిగురిస్తాయి. అలాగే మానవ శరీరంలోనూ కొన్ని మార్పులు జరుగుతాయి. శిశిరం (చలికాలం)లో చర్మంపై వచ్చే చిన్న చిన్న పొక్కుల మూలంగా పొట్టు ఊడిపోతుంది. వసంతంలో కొత్త చర్మం వచ్చి శరీరానికి నవ చైతన్యం లభిస్తుంది. పాములు కుబుసం విడవడం, నెమలి మొదలైన పక్షుల ఈకలు రాలడం, చెట్ల ఆకులు రాలి కొత్త చిగుళ్ళు రావడం... జరిగినట్లే ఇది కూడా ప్రకృతి నియమం. వాతావరణంలోని మార్పు వల్ల శరీరంతో పాటు మనిషి బుద్ధి కూడా వికాసం పొందుతుంది.

ఉగాది నుండి వసంత నవరాత్రులు ప్రారంభమై శ్రీరామనవమితో ముగుస్తాయి.

ఉగాది నాడు వేపపువ్వు కలిపిన ఉగాది పచ్చడి సేవించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ ఆచారం వెనుక ఆరోగ్య సందేశం దాగి ఉంది.

వేప పూత, బెల్లం, చింతపండు, నెయ్యి, మిరియాలు, లవణం కలిపిన షడ్రుచుల మిశ్రమాన్ని ఉగాది పచ్చడి అంటారు. వేప, బెల్లం తినడం వలన శరీరం దృఢంగా ఉంటుంది, సర్వశుభాలూ కలిగి అరిష్టాలు నాశనమవుతాయి అంటారు. ఇది నిజమేనా అంటే - ఉగాది నుండి ఎండలు ముదిరి, వాతావరణంలో మార్పు వస్తుంది. మానవ శరీరంలో ఉష్ణ సంబంధమైన ఉపద్రవాలు (అనారోగ్యాలు) కలుగుతాయి. వీటిని నివారించే ఉద్దేశంతోనే వేసవి రాకముందే ఈ ఉపద్రవాల పాలిట రామబాణం లాంటి వేప-బెల్లం స్వీకరించడం! ఈ పచ్చడి సేవించడం వలన కంటిచూపు, జీర్ణశక్తి వృద్ధి చెందుతాయంటారు. షడ్రసాత్మకమైన ఈ పచ్చడిని కష్ట-సుఖ సమ్మిశ్రితమైన మానవ జీవితానికి ప్రతీకగా నిర్ణయించారు మన పెద్దలు.

ఉగాది నాటి సాయంకాలం దేవాలయాలలో పంచాంగ శ్రవణం జరుగుతుంది. పంచాంగ శ్రవణం సర్వపాపహరం అని ప్రజల నమ్మకం.

ఈ (మార్చి) నెల 16న ప్రారంభమయ్యే శ్రీవికృతి నామ సంవత్సరం సకల ప్రపంచానికీ సుఖ శాంతులను ప్రసాదిస్తుందనీ, ప్రసాదించాలనీ ఆశిద్దాం. ❖

ఉగాది శుభాకాంక్షలు

పాఠకులకూ, రచయితలకూ, రచయిత్రులకూ,
దాతలకూ, ఏజెంట్లకూ, ప్రకటనకర్తలకూ
హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు.

– సంపాదకులు, 'శ్రీరామకృష్ణ ప్రభ'

పరమేశ్వరుని పరిరక్షణలో ...

స్వామి జపానంద స్వీయ అనుభవాలు -33

చంద్రనాథ్‌లో స్వర్ణమృగం

చట్‌గావ్ నుంచి స్వామి జపానంద కొండ మీద గల చంద్రనాథ్ తీర్థం దర్శించడానికి వెళ్ళారు. భోలాగిరిలోని ఆశ్రమంలో స్వామి బస చేసారు. శ్రీరామకృష్ణ మిషన్ స్వామి శ్రీఅనుభవానందజీ వారి బంధువు, బహుశా మేనల్లుడు ఈ ఆశ్రమాన్ని కట్టించారు. వారి దగ్గర నుంచి పరిచయపత్రం తీసుకొని వస్తే అది చూసి వారు జపానందజీకి ఆశ్రమంలో ఉండే ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఆశ్రమంలో ఒక చిన్న పని కుర్రాడు తప్ప మరెవరూ లేరు. అతడే వంట చేసి పెట్టేవాడు. తరచూ పచ్చి మిరపకాయలు, లేదంటే లేత గుమ్మడి కాయ వేసిన కందిపప్పు, అన్నం వండేవాడు. రాత్రికి మాత్రం రెండు చిన్న అరటి పళ్ళు, ఒక గ్లాసుడు పాలు ఉండేవి. వర్షాకాలం అవడంతో అక్కడ చుట్టూ నీరు ఉంది. ఆశ్రమం వాకిట్లో కూడా మోకాలు లోతు వరకు నీరే ఉంది. మట్టితో కట్టిన ఇల్లు చెమ్మగా ఉంది.

రెండు రోజులు విశ్రాంతి తీసుకున్నాక స్వామి శ్రీ చంద్రనాథ్ దర్శనం కోసం బయలుదేరారు. ఆ రోజు వాన పడడం లేదు. దేవాలయం ఊరికి దూరంగా కొండ మీద ఉంది. మెట్లు ఉన్నాయి కానీ ఎక్కడం కష్టంగానే ఉంది. అది దట్టమైన అడవి. అక్కడంతా ముఖ్యంగా గొడుగు కర్రలు తయారు చెయ్యడానికి ఉపయోగించే వెదురు జాతి చెట్లు చాలా ఉన్నాయి. కీచురాళ్ళ ధ్వని ఎక్కువగా ఉంది. సుమారు ఐదు వందల మెట్లున్నాయి. సగం మెట్లు ఎక్కేసరికి అద్భుతమైన దృశ్యం కనపడింది. సన్న్యాసి నిల్చున్న మెట్టుకు రెండు మెట్ల పైన మేకలా ఉన్న బంగారు రంగు జంతువు ఒకటి నిల్చొని ఉంది. అది తదేకంగా సన్న్యాసి వైపే చూస్తోంది. మేలిమి బంగారు వన్నెలో ఉన్న ఆ మృగం చాలా అందంగా ఉంది. అలాంటి మృగాన్ని అంతకు మునుపెన్నడూ సన్న్యాసి చూడలేదు. కేవలం రామాయణంలోనే బంగారు లేడి కథ విన్నారు. అయితే ఇవాళ ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఎవరి పెంపుడు మృగమో, ఏమిటో అనుకుంటూ నెమ్మదిగా మెట్లు ఎక్కుతూ దాని దగ్గరకు చేరి, వంగి పట్టుకోబోయేసరికి అది ఎగిరి గంతులేసి మరొక రెండు మెట్లు పైకి ఎక్కింది. మళ్ళీ సన్న్యాసి రెండు మెట్లు ఎక్కి దాని వైపునకు చెయ్యి చాచేసరికి మరొక రెండుమెట్లు పైకెక్కి అక్కడ నుంచి గంతులేస్తూ మెట్ల దోవ వదిలి అడవిలోకి వెళ్ళింది. అది చూసి స్వామీజీ కూడా ఆ మృగాన్ని అనుసరించారు. వెంటనే ఆ మృగం కూడా మరొక గంతు వేసి, కొంతదూరం వెళ్ళి కూర్చుంది. స్వామీజీకి దాని ముఖం చూస్తే 'నువ్వు నన్ను పట్టుకోలేవులే, వచ్చి పట్టుకో చూద్దాం' అని నవ్వుతూ సవాలు చేస్తున్నట్లుగా అనిపించింది. ఆయన దాన్ని పట్టుకోలేక పోవడంతో ఆ ఆటలో అది చాలా ఆనందిస్తున్నట్లుగా ఉంది.

ఉన్నట్లుండి స్వామీజీకి "ఏమిటి నువ్వు చేస్తున్న పని"



అని ఎవరో అంటున్నట్లు అనిపించింది. చుట్టూ చూస్తే నాలుగు పక్కల నుంచీ ఎన్నో వందల జలగలు త్వరత్వరగా ఆయన వైపు వస్తున్నాయి. "నీ వ్యామోహంలో పడడానికి నేను సీతను కాను" అని అనుకొని, స్వామీజీ మెట్ల మీదకు వచ్చి నిల్చున్నారు. కొంచెం సేపు చూసి మెట్లెక్కడం మొదలు పెట్టారు. ఆ బంగారు లేడి అక్కడే కూర్చొని, సన్న్యాసిని చూస్తూ ఉండిపోయింది.

కొండ పైన గుడి ఉంది. చిన్న కొండ, దూరంగా సముద్రం కనిపిస్తోంది. గుడి నిర్మానుష్యంగా ఉంది. కటకటాల తలుపులలో నుంచి దేవుడికి పలుమార్లు నమస్కరించి, భగవంతుడికి ధన్యవాదాలర్పించారు సన్న్యాసి. "భగవాన్! ఏమిటి నువ్వు చేస్తున్న పని అని హెచ్చరించింది నువ్వే కదా! ఆ మాయలేడి వ్యామోహంలో పడి ప్రాణం పోగొట్టుకునేవాడిని" అని అనుకొని, చాలాసేపు శివుని సన్నిధిలో అలా కూర్చుండిపోయారు. సూర్యాస్తమయం అవుతున్నట్లు గమనించి, కొండ దిగి కిందకు వచ్చారు. కొండ

దిగువన పూజారుల ఇళ్ళున్నాయి. సన్న్యాసి వాళ్ళ దగ్గరకెళ్ళి "కొండ మీద ఉన్న స్వర్ణమృగాన్ని మీరెప్పుడైనా చూశారా?" అని అడిగారు. "స్వర్ణమృగమా? మాకు అలాంటిదేమీ తెలియదే. మేమెప్పుడూ చూడలేదే" అని వాళ్ళన్నారు. "అక్కడికి మీరొక్కరే వెళ్ళారా?" అని ఒకరు అడిగారు. "అవును. అయితే ఏం?" అని సన్న్యాసి అడిగారు. "అక్కడ శివుడితో పాటు ఎందరో దేవీ దేవతలు నివసిస్తారు. అందుకని ఒక్కరూ ఎప్పుడూ వెళ్ళకూడదు. ఒక్కరూ వెళ్ళిన వారెవరూ మళ్ళీ తిరిగి రాలేదు" అన్నారు పూజార్లు.

ఆ తరువాత సన్న్యాసికి మెట్ల కింద ఒక వృద్ధ సన్న్యాసి కనిపించారు. ఎక్కడ ఉన్నారు, ఎప్పుడు వచ్చారు లాంటి క్షేమ సమాచారాలు అడిగాక "ఇక్కడ దగ్గరలోనే మేము శంకర మఠం స్థాపించాము. నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. వచ్చి చూడండి" అన్నారు. ఆయనతో వెళ్ళారు సన్న్యాసి.

గాలి, వెలుతురు బాగా వచ్చే అందమైన భవన నిర్మాణం జరుగుతోంది. పెద్ద పెద్ద గదులు. ఇంకా గుమ్మాలు, తలుపులు, కిటికీలు కట్టలేదు. "మేము ఇక్కడికి దగ్గరలోనే ఉంటున్నాము. ఇవాళ రాత్రి మా దగ్గర ఉండి మా ఆతిథ్యం స్వీకరించండి. మనం ఈ భవనాన్ని ప్రారంభిద్దాం" అని వృద్ధ సన్న్యాసి అన్నారు. సన్న్యాసి ఈ ఆహ్వానాన్ని సంతోషంగా స్వీకరించారు. ఈ విషయాన్ని భోలాగిరి ఆశ్రమానికి కబురు పెట్టారు. ఈ సన్న్యాసి పేరు బ్రహ్మానందగిరి. వారికి ముగ్గురు శిష్యులున్నారు. రాత్రి జపానందజీ, బ్రహ్మానందగిరి చాలా విషయాలు చర్చించు కున్నారు. మాటల మధ్యలో స్వర్ణమృగం సంగతి విని వాళ్ళు విస్మయం చెందారు. సాధారణంగా చాలామంది ఆ అడవిలోకి కర్రలు, వెదుళ్ళు తెచ్చుకొనేందుకు వెళతారు. కానీ ఎవరికీ ఈ స్వర్ణమృగం కనిపించలేదు. అది దైవికంగా సన్న్యాసికి కనిపించి ఉంటుంది. ఎక్కడ కనిపించింది అని అందరూ అడిగారు. "నిజంగా అడవిలో అది తిరుగు తోంది అంటే దాన్ని పట్టుకునే ప్రయత్నం చేస్తాం" అన్నారు. అయితే స్వామి జపానంద అక్కడ ఉండగా ఆ మృగం మరి కనిపించలేదు. ❖ **అనువాదం: శ్రీమతి జి.ఎస్. లక్ష్మి**

Statement about ownership and other particulars about **Sri Ramakrishna Prabha** (according to Form IV Rule 8, circulated by Registrar of Newspapers for India).

1.	Place of Publication	:	Hyderabad - 500 029
2.	Periodicity of Publication	:	Monthly
3.	Printer's Name	:	Swami Jnanadananda
	Nationality	:	Indian
	Address	:	Ramakrishna Math, Domalguda, Hyderabad-500 029
4.	Publisher's Name	:	Swami Jnanadananda
	Nationality	:	Indian
	Address	:	Ramakrishna Math, Domalguda, Hyderabad-500 029
5.	Editor's Name	:	Swami Parijneyananda
	Nationality	:	Indian
	Address	:	Ramakrishna Math, Domalguda, Hyderabad-500029
6.	Name & Address of the individuals who own the news or shareholder holding more than1% of the capital	:	Ramakrishna Math, Domalguda, Hyderabad-500029

I , Swami Jnanadananda, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd.

Swami Jnanadananda

Date: 01.03.2010 Signature of the Publisher

పండుగలు - పర్వదినాలు

మార్చి - 2010

04	గురువారం	:	స్వామి యోగానంద జయంతి
11	గురువారం	:	ఏకాదశి
16	మంగళవారం	:	ఉగాది
24	బుధవారం	:	శ్రీరామనవమి
26	శుక్రవారం	:	ఏకాదశి

ఏప్రిల్ - 2010

10, 24	శనివారం	:	ఏకాదశి

దేవీ వైభవం

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ** విలేఖనం: **శ్రీమతి ఎస్. శేషు**

(...గత సంచిక తరువాయి)

"శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే"– శరణాగతులైన దీనుల ఆర్తిని పోగొట్టి కాపాడే తల్లి, ఆవిడ పనే అది (పరాయణ అంటే అదే పనిగా పెట్టుకోవడం). ఒక్కరొక్కరికి ఒక్కొక్క వ్యసనం ఉంటుందట. అమ్మవారికీ, అయ్యవారికీ ఇద్దరికీ వ్యసనాలు ఉన్నాయట. ఇద్దరికీ ఒకటే వ్యసనం. అదేమిటో పుష్పదంతుడు 'శివమహిమ్నః స్తోత్రం'లో చక్కగా చెప్పాడు. శివుణ్ణి స్తోత్రం చేస్తూ "భువన భయ భంగ వ్యసనినః" అంటారాయన. శివుడు లోకాన్ని ఉద్ధరించడానికి విషం మింగేటప్పుడు "మింగమంటావా" అని అమ్మను అడిగాడట. (ఆమెకి ఇష్టం లేకుండా ఆయన ఏ పనీ చెయ్యడు). లోకం పని ఏమయినా ముందు భర్త క్షేమం చూసుకోవాలి, అయినా విషం మింగమందంటే ఆవిడ మంగళ సూత్రాలను ఎంత గట్టిగా నమ్ముకుందో అంటారు పోతనగారు. అందుకే "మ్రింగెడువాడు విభుండని, మ్రింగెడిదియు గరళ మనియు మేలని ప్రజకున్, మ్రింగుమనె సర్వమంగళ, మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో!" అన్నారు. ఆ విషం ఆయననేమీ చెయ్యదని ఆవిడకు తెలుసు. ఆయన పేరు మృత్యుంజయుడు; విషాన్ని హరించుకోగలిగినవాడు ఆయన. ఆది శంకరులవారు సౌందర్యలహరిలో (అయ్యవారికీ, అమ్మవారికీ భేదం లేదు కనుక) "శివ రూపా శర్వరూపా" అనే పదాలు తీసుకొని, "భ్రువౌ భుగ్నే కించిత్ భువన భయ భంగ వ్యసనినీ" అని సంబోధన చేశారు. భువనాలకు ఏ భయం వచ్చినా వాటిని పోగొట్టడమే వ్యసనంగా కలిగినవారు ఇద్దరూ. అందుకే ఆ తల్లి "శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణి". "భయేభ్యస్త్రాహినోదేవి దుర్గే దేవీ నమోస్తుతే" అన్ని భయాలూ పోగొట్టగలిగే తల్లి. జీవితంలో భయాలను పోగొట్టుకోవడానికి అమ్మను స్తోత్రం చేస్తే చాలు.

"తేజస్వరూపిణి" ఆ తల్లి. అంతేకాదు తేజస్సుకు అధిష్ఠాన దేవత. తేజస్సు అంటే శక్తి అని ఒక అర్థం. ఒక్కొక్కరిలో ఒక్కొక్క తేజస్సు ఉంటుంది. వేదవిద్య ఎవరియందు ఉంటుందో వారి యందు బ్రహ్మతేజస్సు ఉంటుంది, క్షాత్రమున్న వారి యందు క్షాత్రతేజస్సు. "సిద్ధవిద్యా సిద్ధమాతా" – అమ్మ సిద్ధవిద్యా స్వరూపిణి. దశమహావిద్యలకు సిద్ధవిద్యలని పేరు. ఆ సిద్ధవిద్యా స్వరూపిణి సిద్ధేశ్వరి. సిద్ధి అమ్మ స్వరూపం. అందుకే ఏ కార్యసిద్ధికైనా దుర్గను ప్రార్థన చేస్తాం.

'దేవీ సూక్తం'లో దేవతలందరూ గౌరీదేవిని కీర్తించిన దానినంతటినీ 'దేవీభాగవతం'లో వ్యాసదేవుడు క్లుప్తంగా ఇలా చెప్పారు: "అమ్మవారు కైలాసంలో శివుని దగ్గర ఉండే శివస్వరూపిణే కాదు ప్రకృతి; కనుక ఈ కృతి అయిన జగతి అంతా ప్రకృష్టంగా వ్యాపించిన ఆ జగదంబిక అందరిలోనూ ఉంది". లోపల చైతన్యం ఉంటేనే, మన కంఠం పలికేది. ఈ జగత్తంతా సంచరించే చైతన్యమే అమ్మ. మనలో ఉన్న చైతన్యం అమ్మ యొక్క స్వరూపం అని తెలుసుకుంటే మనలో అమ్మ ఉనికి తెలుస్తుంది. అప్పుడు మనం ఉనికి లేని వారమై అందులో కరిగిపోతాం. ఆ విషయాన్నే దేవీమాహాత్మ్యం 'యాదేవీ సర్వభూతేషు చేతనే త్యభిధీయతే నమస్తస్యై నమస్తస్యై నమో నమః' అని చెబుతోంది.

రెండోది మహాలక్ష్మీ స్వరూపం. భగవంతుడు తన శక్తిని జగద్రక్షణ కోసం, జగన్నిర్వహణ కోసం వ్యక్తం చేస్తాడు; ఆ శక్తే అమ్మ. మహాలక్ష్మీదేవి శుద్ధ సత్త్వ స్వరూపిణి. రజోగుణ తమోగుణ మాలిన్యాలు ఏ మాత్రమూ లేని సత్త్వాన్ని శుద్ధ సత్త్వగుణం అంటారు. అమ్మ ఈ మూడు గుణాలూ అందరిలో నింపింది.

ప్రతి ఒక్కరిలో వారి వారి కర్మవిశేషాన్ని బట్టి సత్త్వ రజస్తమో గుణాలు మూడూ ఉంటాయి. అవి లేనివాళ్ళు ఎవరూ ఉండరు. అందరిలో ఈ మూడూ కలిసి ఉంటాయి. అయితే, పాళ్ళలో తేడాలుంటాయి. శుద్ధ సత్త్వ భూమికను ఉపాసన చేసిన వారికి కైవల్య ప్రాప్తి లభిస్తుంది. వారు మాత్రమే త్రిగుణాతీత స్థితికి చేరగలరు. ఏ దేవతను ఉపాసన చేస్తే, తద్దేవతా లక్షణాలు ఉపాసకుడికి సంక్రమిస్తాయి. ఇది సహజం. గాఢమైన భావన ఎలా ఉంటే ఆ లక్షణాలు వస్తాయి. లక్ష్మీదేవి, దుర్గాదేవి, సరస్వతి – వీళ్ళందరినీ ఆరాధన చెయ్యడం వల్ల త్రిగుణాత్మికమైన మన స్వభావం (అంటే ప్రకృతి) శుద్ధమై, క్రమక్రమంగా మన సిద్ధికి హేతువు అవుతోంది. అందుకు ఇలాంటి వారిని ఉపాసన చేయాల్సిందిగా చెబుతున్నారు. అవి మనం కల్పించుకున్నవి

కావు. మనం ఉపాసించడానికి వీలుగా అమ్మ తనను తాను అలా వ్యక్తపరుచుకుంది.

శుద్ధ సత్త్వ స్వరూపిణి అయిన ఆ తల్లిని పద్మ అన్నారు. వికసనాత్మక విద్యకు సంకేతం పద్మం. వికసనమే పద్మం, ఈ సృష్టి ఒక మహా పద్మం. ఆనందం వికసించాలి, జ్ఞానం వికసించాలి. ముడుచుకోవడం దుఃఖం, అహంకారం లాంటి వ్యతిరేక భావాలకు సంకేతం. కాంతికీ, జ్ఞానానికీ, ఐశ్వర్యానికీ సంకేతమైన పద్మమే అమ్మ స్వరూపం. వికసనమే అమ్మ లక్షణం (ముడుచుకుపోవడం అలక్ష్మీ స్వరూపం). లక్ష్మి అంటే ఎన్నో రకాలుగా ఉన్న మహాచైతన్య స్వరూపిణి. "లక్ష్యతే మీయతే అనయా ఇతి లక్ష్మి"– జగత్తులో అన్నిటికీ లక్షణశక్తిని 'మీయతే' అంటే దానికి తగ్గట్లు కొలత చూసి ఇచ్చే చైతన్య స్వరూపిణి లక్ష్మి. అందుకు లక్ష్మి అనే శబ్దం జగత్తు అంతా వ్యాపించిన లక్షణశక్తిని తెలియ జేస్తోంది. సృష్టిలో స్వాభావికమైన ప్రకృతియే లక్ష్మి అని చెప్పబడుతోంది.

"పద్మాసా పరమాత్మనః సర్వ సంపత్ స్వరూపా సా తదధిష్ఠాత్రి దేవతా" అన్నారు. "సర్వ సంపత్ స్వరూపా సా – సర్వ సంపత్స్వరూపిణి" – అంటే ఏది పోషకమో, ఏది రక్షకమో అది సంపద. జగత్తులో దేని ద్వారా లక్షింపబడుతున్నారో, రక్షింపబడు తున్నారో, పోషింపబడుతున్నారో అది సంపద. "తత్ శక్తి సర్వ సంపత్ స్వరూపా సా తదధిష్ఠాత్రి దేవతా కాంతా అతి దాంతా శాంతా" – అమ్మ వారి లక్షణం ఇది. అమ్మ వారిది కమనీయమైన స్వరూపం కనుక కాంతా; అతిదాంతా అంటే నిగ్రహ సంపన్నురాలు; సౌమ్యత అమ్మ స్వరూపం. ఇంద్రుడు ఆమెను స్తోత్రం చేస్తూ, "కోపాది పరివర్జితే" – కోపాది దుర్గుణాలు లేని తల్లి అన్నాడు. కోపాలు, కలహాలు ఉన్న ఇంటిని ఆ తల్లి విడిచి పెడుతుంది. అందుకే ఎల్లవేళలా ఉండవలసినది అతిదాంతా – నిగ్రహశక్తి; సౌమ్యత. స్త్రీలలో ఉండే సౌమ్యత అమ్మవారి స్వరూపం. "సర్వమంగళా లోభ మోహ కామ రోష మద అహంకార వర్జితా" – వెతికినా కూడా ఇవన్నీ ఆమెలో కనబడవు. ఎప్పుడూ దేవతను ఆరాధించాలంటే ముందు మనం దేవత అయిపోవాలి. అంటే ఆ సులక్షణాలు మనం సంపాదించుకొని, అమ్మను ఆరాధిస్తే చాలా చక్కగా ఫలిస్తుంది. మనం ఈ గుణాలను సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నప్పుడు అవి పరిపూర్ణంగా లేవూ అంటే ప్రయత్నం చేసి అమ్మను ఆరాధిస్తే తప్పకుండా ఈ గుణాలను అమ్మ పరిపూర్ణంగా ఇస్తుంది.

'భక్తా సురక్తా వర్చిశ్చ సర్వాభ్యశ్చ పతివ్రతా'= భక్తుల ఎడల అనురాగం కలది, భక్తవత్సల స్వరూపిణి. అదే విధంగా పతి యందు అనురక్తి కలది. పతివ్రతలందరికీ శిరోమణి అయిన జగదంబిక. సాత్త్వికంగా ఏది అడిగినా ఇవ్వాలని ఆ తల్లికి అనిపిస్తుంది. అందుకే "పతివ్రతాంగనా భీష్ట ఫలదాయై నమో నమః" అనేది అమ్మవారి పేరు. ఎప్పుడూ అమ్మ మన దగ్గరే ఉండాలీ అంటే ముందు నారాయణుణ్ణి తెచ్చుకోవాలట. ఎందుకంటే ఆమె ఆయనను విడిచిపెట్టదు.

నారాయణ భట్టాద్రి "నారాయణా నీ వల్ల మా తల్లికి "చంచలా" అన్న పేరు వచ్చింది" అంటారు. ఆవిడకు 'సుస్థిరా' అన్న పేరు ఎప్పుడు వస్తుందంటే... ఎవరు హరిని దగ్గరకు తెచ్చుకుంటారో వారి దగ్గర సిరి ఉంటుందట. గజేంద్రమోక్షంలో గజేంద్రుడు ఎలుగెత్తి విష్ణుమూర్తిని ప్రార్థిస్తే ఆయన కదిలి వచ్చారు, ఆయన వెంటే లక్ష్మి కదిలి వచ్చింది. అదే పోతనగారు "తన వెంటన్ సిరి లచ్చి వెంట..." – హరి వెంట సిరి వస్తుంది అన్నారు.

"సర్వ సశ్యాత్మకా దేవి జీవనోపాయ రూపిణీ"–ఆ మహాలక్ష్మియే సర్వసశ్యస్వరూపిణి అయినటువంటిది; సశ్యములన్నీ కూడా అమ్మవారి రూపాలు; అమ్మ స్వరూపమే జీవనోపాయం, ఆ ఉపాయం అమ్మ ఇస్తున్నది. నారాయణుని యొక్క శక్తి లోకరక్షణ కోసం ఒక్కొక్కలోకంలో ఒక్కొక్కపేరుతో ప్రకటింపబడుతూవుంది.

"స్వర్గేచ స్వర్గలక్ష్మీశ్చ రాజ్యలక్ష్మీశ్చరాజసు గృహేషు గృహలక్ష్మీశ్చ మర్త్యానాం గృహిణాం తథా"... ఆ తల్లి స్వర్గంలో స్వర్గలక్ష్మిగా, రాజ్యములలో రాజ్యలక్ష్మిగా, గృహాలలో గృహలక్ష్మిగా ఉంటున్నది. లక్ష్మి అనుగ్రహం ఉంటే ఇల్లంతా కళకళలాడుతుంది. అమ్మ అనుగ్రహంవల్లనే గృహాలలో గృహలక్ష్మి భాసిస్తున్నది. ఏ ప్రాణియందైనా ఒక కళ, ఒక శోభ కనిపిస్తున్నదంటే అది అమ్మ యొక్క రూపం అని తెలుసుకోవాలి. ❖ **(సశేషం)**

భారత స్త్రీత్వానికి ఆదర్శం-సీత

భారతావనిలో నారీలోకానికి సీత ఆదర్శం. సీత అనే స్త్రీ అసలు జీవించిందా లేదా అని గానీ, అది ఒక కట్టుకథా లేక చారిత్ర్యక సత్యమా అని గానీ మనం విమర్శించాల్సిన పనిలేదు. కానీ ఆమె ఆదర్శం భారతీయుల మనస్సుల్లో స్థిరపడింది. సీత నెలకొల్పిన ఈ ఆదర్శం జనుల జీవితాల్లోకి చొచ్చుకొనిపోయి, వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసి, వారి రక్తనాళాల్లో జీర్ణించుకొని ఉందనడం సత్యం. ఏ ఇతర పురాణగాథ కూడా జాతిని ఇంతగా ప్రభావితం చెయ్యలేదు. భారతదేశంలో మంచితనానికీ, స్వచ్ఛతకూ, పవిత్రతకూ మారుపేరు సీత. పెద్దవారెవరైనా ఒక స్త్రీని కానీ, ఒక బాలికను కానీ ఆశీర్వదించే సమయంలో 'నీవు సీతలా జీవించు' అని అంటారు. సహనశీలి, దుస్సహమైన కష్టాలను ఓర్చిన వ్యక్తి, పతి విశ్వాసాన్ని చూరగొన్న పరమసాధ్వి అయిన సీతలా జీవించాలని భారత స్త్రీలు తీవ్రమైన కృషి చేస్తారు. మూర్తీభవించిన భారత నారీరత్నం సీత. ప్రతీకారదృష్టికి ఆమె ఎప్పుడూ దూరంగా ఉండేది.

భారతదేశంలోనే కాదు మొత్తం ప్రపంచ సాహిత్యం అంతా వెదకినా సీత వంటి సాధ్వి మనకు కనిపించదు. ఆమె ఒక విశిష్టమైన స్త్రీ. రాముడి లాంటి వ్యక్తులను మరికొందరిని మనం చూడవచ్చు. కానీ సీత లాంటి మరొక స్త్రీ మనకు తటస్థించదు. భారతనారి యొక్క పవిత్ర ఆదర్శాలన్నిటినీ పరిపూర్ణంగా పుణికి పుచ్చుకొన్న స్త్రీ రత్నంగా కొన్ని వేల సంవత్సరాలుగా ఆర్యావర్తంలో నలుమూలలా ప్రజలచేత ఆరాధింపబడుతున్న సాధ్వీమణి సీత. స్వచ్ఛతకే వన్నె తెచ్చిన స్త్రీగా, సహనశీలిగా, కష్టజీవిగా సౌభాగ్యవతి అయిన సీత ప్రజల హృదయాల్లో నిరంతరం నివసిస్తుంది. అసంతృప్తికి లోనుకాకుండా అష్టకష్టాలనూ అనుభవించిన పతివ్రత అయిన సీత మన జాతికి ఆరాధ్య దేవతగా కలకాలం నిలిచిపోవాలి.

మన పురాణ వాఙ్మయం అదృశ్యమైనా, మన వేదాలు మరుగునపడినా, మన సంస్కృత సారస్వతం నశించినా కనీసం ఐదుగురు భారతీయులున్న చోట సీత కథ సజీవంగా నిలుస్తుంది. జాతి హృదయాల్లో స్థిరంగా సీత ప్రతిష్ఠితమైంది. ప్రతి భారతీయుని రక్తనాళాల్లో ఆమె భాగమై పోయింది. భారత యువతిని సీత యొక్క ఆదర్శాలకు దూరం చేసి, ఆమెను అధునాతన స్త్రీగా మార్చదలచే యత్నాలన్నీ విఫలం కాక తప్పదు. ఇది నిత్యం మనం చూస్తూనే ఉన్నాం. భారత స్త్రీ సీత అడుగుజాడలలో నడచి అభివృద్ధి మార్గంలో పయనించాలే తప్ప వేరే మార్గం లేదు. ❖

పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

పి. సుందరరావు, ఒంగోలు.

? : యుధిష్ఠిరుడు ధర్మవర్తనుడు. కానీ, జూదంలో సోదరులనూ, ధర్మపత్నినీ పందెంగా ఒడ్డడం ధర్మవర్తనమా? నాకు ఆత్మక్షోభగా ఉంది. ధర్మసూక్ష్మం తెలిపి నా బాధ తగ్గించండి.

✍: మహాభారతంలో ధర్మనందనుని ప్రవర్తన అసామాన్యుల నుంచి పామరుల వరకు వేధించే ప్రశ్నే! అయితే మానవాళికి గుణపాఠాలు నేర్పడానికే ఇతిహాసాలు, పురాణాలను చెప్పారు. అంతటి ధర్మరాజే జూదానికి బానిసయ్యాడంటే సామాన్యుల మాట చెప్పాలా! పేకాట రాయుళ్ళు, గుఱ్ఱపు పందాల రాయుళ్ళు, లాటరీ టికెట్లు, ఇటీవల క్రికెట్‌లో, ఎన్నికల్లో బెట్టింగులు కట్టి అప్పుల పాలై, అధోగతి పట్టి ఆత్మహత్యలు చేసుకొన్నవాళ్ళు ఉన్నారు.

మహాభారతంలో ధర్మపరులైన పాండవులు, వాసుదేవుణ్ణి నమ్మి, ధర్మం కోసం ఎన్ని కష్టాలైనా అనుభవించి, చివరకు అధర్మవర్తనులపై విజయాన్ని సాధించారు. వారు ఎక్కడా తమ ఉత్సాహాన్ని కోల్పోలేదు. అందుకే పెద్దలు ఇలా అన్నారు–

ద్యూత మాంస సురా వేశ్యా, ఖేట చౌర్య పరాంగనారి,
మహా పాపాని సప్తైవ, వ్యసనాని త్యజేద్బుధః

'జూదం (పేకాట), మాంసభక్షణం, సురాపానం, వేశ్యా సంగమం, వేట, దొంగతనం, పరస్త్రీ(పరపురుష) లోలత్వం – ఈ ఏడూ మహా వ్యసనాలు, మహా పాపకరాలు. వీటిని బుద్ధిమంతులు వదిలిపెట్టాలి' అంటోంది శాస్త్రం.

విద్వద్భిః సేవితః సద్భిః నిత్యమద్వేష రాగిభిః,
హృదయేనాఽభ్యనుజ్ఞాతో, యో ధర్మ స్తన్నిబోధత
(మనుస్మృతి – 2.1)

'ఏ విధమైన అభిలాష, ద్వేషం లేనివారూ, యోగ్యులూ, పండితులూ, సత్పురుషులూ, విద్వాంసులూ అయిన వారు ఆచరిస్తున్నదీ, మీ మనస్సుకు ఆమోదమైనదీ ఏది కలదో ఆ ధర్మాన్ని గ్రహించండి' అన్నారు మనువు. అప్పుడే శాంతి, సుఖం, ఆనందం కలుగుతాయి. అశాంతి, దుఃఖం, నిరానందం తొలగుతాయి.

సి. త్రిపుర సుందరి, బెంగుళూరు.

? : భగవద్గీత ఇంటి యందు పఠించవచ్చునా? పఠించరాదా?

✍: భగవద్గీత ఇంట్లోనూ, గుడిలోనూ, మఠాల్లోనూ ఎక్కడైనా పఠించవచ్చును. స్వామి వివేకానంద పరివ్రాజకుడిగా ఉన్నప్పుడు ఆయన వద్ద భగవద్గీత ఉండేది. భగవద్గీత, రామాయణ, భారత, భాగవతాలు ఇంట్లో పెట్టుకోరాదని కొందరు సలహా ఇస్తుంటారు. దైవం, ఆత్మ ఏమీలేవని భావించే లౌకికులు పవిత్ర గ్రంథాలను లక్ష్యపెట్టక కుతర్కంతో ఇతరులను అయోమయంలో పడవేస్తుంటారు. వారి సలహాలు వినవద్దు. ఎక్కడ గీతాపఠనం, పాఠనం ఉంటాయో అక్కడ పరమాత్ముడుంటాడు. ఆ ఇంటి వారందరికీ తమ కార్యాల్లో విజయం, ఐశ్వర్యం, కీర్తి కలుగుతాయి. గీతను నిత్య పారాయణ చేస్తూ ప్రతిపదార్థం, భావం తెలుసుకోవాలి.

రాధాచరణ్, నివగాం.

? : సీతాపహరణ వృత్తాంతం భరత, శత్రుఘ్నులకూ, జనకునికి తెలియదా? వీరి ప్రమేయం ఎందుకు కానరాదు.

✍: వాల్మీకి మహర్షి విరచిత రామాయణ కావ్యంలో సీతాపహరణం భరతాదులకు తెలిసినట్లు లేదు. సీతారామ కథలో వీరిద్దరే ప్రధాన పాత్రలు. రామాజ్ఞతో భరతుడు ఆయన పాదుకలు స్వీకరించి వాటిని సింహాసనంపై పెట్టి పునః రామ దర్శనం అయ్యే వరకు అయోధ్య పొలి మేరల్లో ఉండి, రాజ్యాన్ని పాలించిన మహాభక్తుడు. వారికి సీతాపహరణం తెలిసినట్లులేదు. మహాపరాక్రమశాలి, బ్రహ్మదత్త వరాలతో ఉన్న రావణుని వధ శ్రీరాముడే చెయ్యాలి కదా! ❖

అమరధామానికి సేతువు

– డాక్టర్ కమల జయరావు

1882వ సంవత్సరం అక్టోబరు 16వ తేదీ, దుర్గా పూజకు కొన్ని రోజుల ముందు ఒకనాడు మాస్టర్ మహాశయ్ దక్షిణేశ్వరం వెళ్ళారు. ఆనాడు నరేంద్ర, రాఖాల్ మున్నగువారు అక్కడే ఉన్నారు. మధ్యాహ్నం విశ్రాంతి తరువాత నరేంద్ర కొన్ని పాటలు పాడాడు. అనంతరం నరేంద్ర, మాస్టర్ మహాశయ్ గది వెలుపలకు వచ్చి, నాటి యువతరాన్ని గురించి ముచ్చటించుకొంటున్నారు. శ్రీరామకృష్ణులు వచ్చి భగవత్ చర్చ తప్ప, మరేదీ మాట్లాడడం మంచిది కాదని కొంచెం గంభీరంగా అన్నారు. నరేంద్ర కన్నా వయస్సులో పెద్దవాడు కనుక మాస్టర్ మహాశయ్ ఇలాంటి చర్చలను ప్రోత్సహించ కూడదంటూ ఆయనను సున్నితంగా మందలించారు.



రాత్రి భోజనానంతరం మరికొంతసేపు సంకీర్తన జరిగింది. శ్రీరామకృష్ణులు 'నీకు కలలు వస్తాయా' అని ఒక 'భక్తుణ్ణి' హఠాత్తుగా ప్రశ్నించారు. భక్తుడు అన్నప్పుడు ఇక్కడ మాస్టర్ మహాశయ్ అని మనం ఊహించుకోవాలి. ఆ భక్తుడు, "ఈ సమస్త జగత్తు జలమయమైందట. అనంత జలరాశి. అందులో కొన్ని తెప్పలు తేలియాడుతున్నాయట. ఇంతలో ఉత్తుంగ తరంగాలు లేవగా, తెప్పలు మునిగి పోయాయట. మాస్టర్, మరి కొందరు ఒక నౌక ఎక్కారు. ఇంతలో ఒక బ్రాహ్మణుడు ఆశ్చర్యకరంగా నీటిపై నడచి వెళ్ళుతున్నాడు. మీకు ఇదెలా సాధ్యమని మాస్టర్ అడుగగా ఆయన నవ్వి, "ఏమీ కష్టం లేదు. నీటి అడుగున ఒక వంతెన ఉంది" అన్నాడు. ఎక్కడకు వెళుతున్నారని మాస్టర్ ప్రశ్నించగా, భవానీ పురమని సమాధానం. 'ఆగండి, ఆగండి, నేనూ మీతో వస్తాను'అన్నారు మాస్టరు. 'నేను తొందరలో ఉన్నాను. నీవు నౌక దిగడానికి ఆలస్యం అవుతుంది. ఈ దారి గుర్తు పెట్టుకొని, తరువాత రా' అన్నాడు బ్రాహ్మణుడు" అని తన స్వప్న వృత్తాంతం తెలిపాడు. "ఆహా! ఇది విని నాకు రోమాంచం కలుగుతోంది. నీవు వెంటనే మంత్రోపదేశం పొందు" అని అన్నారు శ్రీరామకృష్ణులు.

మన ఆలోచనలు, మనం చూసిన దృశ్యాలు మెదడులో నిక్షిప్తమై ఉండి, కలల రూపంలో వెల్లడి అవుతుంటాయి. కనుక, మాస్టర్ మనస్సు ఆధ్యాత్మిక సాధనకు సిద్ధంగా ఉన్నందునే ఇలాంటి స్వప్నం వచ్చిందని శ్రీరామకృష్ణులు గ్రహించారనీ, అందుకే వారికి పులకరింత కలిగిందనీ స్వామి భూతేశానందజీ వ్యాఖ్యానించారు.

అదీ గాక, భగవత్ చర్చ తప్ప ఇతరం ఏదీ మాట్లాడవద్దని అంతకు పూర్వమే శ్రీరామకృష్ణులు, మాస్టర్‌ను మంద లించారు. మాస్టర్ సౌమ్యుడు, సాత్త్వికుడు. కానీ ఎంతటి వారైనా మంత్రోపదేశం పొంది, గురువుల ఆదేశానుసారం ఆధ్యాత్మిక సాధనలు చేయనిదే ఆ మార్గంలో పురోగ మించలేరు. ఇందుకు శ్రీరామకృష్ణులు ఒక కథ చెప్పారు: ఒకసారి నారదుడు వచ్చి వెళ్ళిన తరువాత, ఆయన కూర్చొని వెళ్ళిన స్థలాన్ని శుద్ధి చేయమన్నారట శ్రీమహావిష్ణువు. నారదుడు శుద్ధ మనస్కుడు, ఆజన్మ బ్రహ్మచారి; కానీ మంత్రపూతుడు కానందు వల్ల శుద్ధి అవసరమన్నారట!

మాస్టర్ శ్రీరామకృష్ణుల ఆదేశాలు జవదాటరు కాబట్టి మంత్రదీక్ష పొంది ఉండవచ్చు. ఆయన గురువు ఎవరో మనకు తెలియదు. శ్రీరామకృష్ణులు విధి పూర్వకంగా ఎవరికీ దీక్షా ప్రదానం చేసినట్లు లేదు. చాలా కొద్దిమందికి నాలుకపై బీజాక్షరం లిఖించారు. మాస్టర్ ఇలాంటి దీక్ష పొందినట్లు చెప్పలేదు. నేను ఎవరికీ గురువును కాను అన్నారు శ్రీరామకృష్ణులు. ఆయన వ్యావహారిక సద్గురువు కాదు. సకల సద్గురువులకూ గురువు, పరమ గురువు.

ఇకపోతే, మాస్టర్ స్వప్న వృత్తాంతం: జగత్తు సమస్తం జలమయం, అందులో తెప్పలు! మనం ఉండేది సంసార సాగరంలో, అది దుస్తరం; సులభంగా తరించగలిగినది కాదు. జీవులే తెప్పలు. ఆ తెప్పలను కెరటాలు ముంచి వేశాయి – అంటే సంసారంలోని ఆటుపోట్లకు తట్టుకోలేక సామాన్యులు అందులోనే మునిగిపోతారు. 'పునరపి జననం, పునరపి మరణం'. కానీ, మాస్టర్ నౌకను (మిగతా 30వ పేజీలో)

సీతాదేవి జన్మ రహస్యం

ఆధారం : శ్రీ కృపానంద వారి రామగాథ   చిత్రాలు : శంకర్   తెలుగుసేత: స్వామి జ్ఞానదానంద

1 పద్మాక్షుడనే మహారాజు సంతానప్రాప్తికి తపస్సు చేశాడు.
అతని తపస్సుకు మెచ్చిన శ్రీమన్నారాయణుడు అతనికి ప్రత్యక్షమై...



2 శ్రీమన్నారాయణుడు మహారాజుకు ఒక దానిమ్మపండును ప్రసాదించాడు. దానిని మహారాజు తన భార్యకు ఇచ్చాడు. ఆ పండును ఒలిచేసరికి లోపల ఒక శిశువు కనపడింది. బాలికకు పద్మాక్షి అని నామకరణం చేశారు.

3 పద్మాక్షి తన ఐదవ ఏట నుంచి తపస్సు చేయసాగింది. ఆ తపస్సు తొమ్మిది సంవత్సరాలు కొనసాగింది.

4 పద్మాక్షికి యుక్త వయస్సు వచ్చాక మహారాజు ఆమెకు స్వయంవరం ఏర్పాటుచేశాడు.
పలువురు మహారాజులు స్వయంవరానికి హాజరయ్యారు.



www.rkmath.org — Ramakrishna Math Hyderabad — Free Soft Copy



మిగతా 36వ పేజీలో...

అన్నిటికీ అవసరమైన తులసి

వివిధ భాషల్లో తులసి

తులసికి అనేక పేర్లున్నాయి. ఆ యా ప్రాంతాలు, భాషలను బట్టి పేర్లు మారిపోతుంటాయి. తులసి అనేది సంస్కృత నామం. దీన్నే సంస్కృతంలో ఇంకా 'విష్ణుప్రియ', 'దివ్య', 'భారతి', 'కృష్ణమూలం' అని పిలుస్తుంటారు. తెలుగు, తమిళం, కొంకణి, మరాఠీ భాషల్లో కూడా దీన్ని 'తులసి' అనే పిలుస్తారు. కన్నడంలో 'కరి తులసి' అనీ, మలయాళంలో 'శివ తులసి' అనీ, హిందీలో 'కళా తులసి' అనీ, బెంగాలీలో 'కృష్ణ తులసి' అనీ అంటారట! సింహళ భాషలో 'మదురు - తుల్ల' అని పిలుస్తారట! ఫ్రెంచ్‌లో దీన్ని 'బాసిలిక్ సెయింట్' అని వ్యవహరిస్తారట! పవిత్రమైన తులసిని ఇంగ్లీషులో 'హోలీ బాసిల్' అని అంటారు. ఇక, దక్షిణాఫ్రికాలో దీన్ని 'మస్కిటో ప్లాంట్' అని పిలుస్తారు.



తులసిలో రకాలు

తులసిలో 'లక్ష్మి తులసి' లేదా 'శుక్ల తులసి', 'కృష్ణ తులసి' అనే రెండు ముఖ్యమైన రకాలున్నాయి. వాటిలోనూ 'శుక్ల తులసి'లో మళ్ళీ బబయి, మూత్రల, బాలంగా, రామ, కర్పూర, వన, శౌంఠి అనే ఏడు ఉపజాతులున్నాయి. వీటిలో పూజకు అత్యంత యోగ్యమైనది - కృష్ణ తులసి.

తులసీ ప్రార్థన

విశేష ప్రాచుర్యంలో ఉన్న తులసీ ప్రార్థనా శ్లోకం ఇదీ:

యన్మూలే సర్వ తీర్థాని యన్మధ్యే సర్వ దేవతాః ।
యదగ్రే సర్వ వేదాశ్చ తులసీమ్ త్వామ్ నమామ్యహమ్ ॥

(మాఘపురాణం)

'మూల భాగంలో (చెట్టు వేళ్ళలో) అన్ని తీర్థాలనూ, మధ్య భాగంలో అందరు దేవతలనూ, చివరి భాగంలో సమస్త వేదాలనూ కలిగి ఉన్న ఓ తులసీ! నీకు నేను నమస్కరిస్తున్నాను'.

ప్రతి రోజూ పై శ్లోకాన్ని ఉచ్చరిస్తూ, తులసి చెట్టుకు నీళ్ళుపోస్తూ, నమస్కరించడం సర్వోత్కృష్టమైన పుణ్యకార్యం. ముఖ్యంగా, శుక్ర, శనివారాలు శ్రీతులసి పూజకు ప్రత్యేకమైన దినాలు.

తులసికి అగ్రభాగంలో బ్రహ్మ, మధ్యభాగంలో శ్రీమహావిష్ణువు, కాండంలో మహేశ్వరుడు, శాఖల్లో అష్టదిక్పాలకులు ఉంటారు. గాయత్రి, లక్ష్మి, సరస్వతి, శచీదేవుల నివాసస్థానమే తులసీ పత్రం అని శాస్త్రాలు చెబుతున్నాయి.

తులసికి వైష్ణవీ, సుగంధా, అమృతా, పవిత్రా, కాయస్థా, భూతఘ్ని, ప్రేత రాక్షసీ, పాపఘ్ని, లక్ష్మి, బృంద, బృందావని, నందిని, పుష్పసార, కృష్ణజీవని, విశ్వపావని, విశ్వపూజిత - ఇలా ఎన్నో పేర్లున్నాయి. సరిగ్గా గమనిస్తే ఇవన్నీ తులసికి ఉన్న లక్షణాలను బట్టి వచ్చిన సార్థక నామధేయాలే! శ్రీతులసిని - 'తులసి, బృంద, బృందారిణి, విశ్వపూజిత, విశ్వపావని, పుష్పసార, నందినీ తులసీ, కృష్ణసేవిత' అనే ఎనిమిది నామాలతో పూజించినవారికి 'అశ్వమేధ యాగం' చేసిన ఫలితం కలుగుతుంది.

తులసీ శ్రీసఖి శుభే పాపహారిణి పుణ్యదే ।
నమస్తే నారద నుతే నారాయణ మనః ప్రియే ॥

'పాపాలను హరించి, పుణ్యాన్ని అందించే తులసీ నీకు వందనం. నారదుడు నుతించినదానవూ, నారాయణుడి మనస్సుకు ప్రియమైన దానవూ అయిన నీకు నమస్సులు!'

తులసి నిత్యగుణ స్వరూపిణి. ఆకులో, కాండంలో, వాసనలో, చివరకు తులసి చెట్టు మూలంలోని మట్టిలో కూడా సత్త్వగుణం నిండి ఉంటుంది. తులసి సంపర్కం వల్ల మనకు కూడా సత్త్వగుణం అలవడుతుంది. తులసి వాసన మనలోని తమో గుణాన్ని పారద్రోలి, సాత్త్విక గుణాన్ని పెంపొందిస్తుంది.

తులసి మృత్తికను తిలకంగా, వేరును గంధంగా, కాండాన్ని జపమాలకు పూసలుగా, ఆకులను పూజకూ, విత్తనాలను విషాది దోషాలకు విరుగుడుగా వాడతారు. తులసికి పర్యుషితాది దోషాలు లేవు. శ్రౌత స్మార్త కర్మలు దేనికైనా తులసి కావాల్సిందే! చివరకు శ్రాద్ధ కర్మల్లో సైతం దేవార్ఘ్య పాత్రలను పావనం చేయడానికి తులసి ఉండాల్సిందే! ❖

(వచ్చే సంచికలో 'తులసికి సంబంధించి విధులు, నిషేధాలు')

రామభక్తుడు

త్యాగరాజు

– శ్రీమతి బొప్పన అరుణాదేవి

భక్తికి ప్రాధాన్యం ఇచ్చిన వాగ్గేయకారుడు త్యాగయ్య. తమిళదేశంలో జన్మించి, తెలుగులో కీర్తనలు వ్రాసి కర్ణాటక సంగీతంలో కృతుల్ని వెలువరించడం విశేషం. త్యాగయ్య సంగీత సాహిత్యాలలో నిష్ణాతుడు; నాదబ్రహ్మ. వాల్మీకి, నారదుడు, శారదాదేవి అంశలతో జన్మించాడు. త్యాగయ్య కృతుల్లో ముప్పాతిక భాగం రామాయణ వృత్తాంతాలే. ఇతడు అనన్య రామభక్తుడు. ప్రజల దాంబికాచారాలనూ, బలహీనతలనూ, రాజుల కుటిల వర్తనాన్నీ విమర్శిస్తూ కీర్తనలు వ్రాశాడు. త్యాగయ్య వంశస్థులంతా మహాపండితులు, వాగ్గేయకారులే.

త్యాగయ్య గంటల తరబడి పూజగదిలో రామ ధ్యానంలో గడిపేవాడు. శ్రీరాముణ్ణి కీర్తిస్తూ పూజ గది గోడల మీద కీర్తనలు వ్రాసేవాడు. అవి చదివిన పండితులు అందులోని సంగీత సాహిత్యాలను మెచ్చుకునేవారు. వీరి గురువు శొంఠి వేంకట రమణయ్య గారు ఏర్పాటు చేసిన 'విద్వత్సభ'లో 'దొరకునా ఇటువంటి సేవ' అంటూ కీర్తన పాడి, అందరినీ మంత్రముగ్ధుల్ని చేశాడు.

పుదుక్కొట్టై సంస్థానాధిపతి సంగీత కళను పరీక్షించడానికి ఏర్పాటుచేసిన సభలో త్యాగరాజు జ్యోతిస్వరూపిణి రాగంలో పాడి, దీపాలు వాటంతట అవే వెలిగేలా చేసి సభాసదులను ఆశ్చర్యంలో ముంచాడు. త్యాగయ్య మేనమామ ఇంట్లో ఎన్నో సంగీత గ్రంథాలు ఉండేవి. వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసినా త్యాగయ్యకు ఎన్నో సందేహాలు కలిగేవి. వాటిని తీర్చేందుకు నారదమహర్షి సాధువు వేషంలో వారింటికి వచ్చి కొన్ని సంగీత గ్రంథాలను అతనికి ఇచ్చి కావేరిలో స్నానసంధ్యలు ముగించుకొని, భిక్ష సమయానికి వస్తాను అని చెప్పి వెళ్ళిపోయాడు. సాధువు కోసం ఎదురుచూస్తూ రోజంతా ఉపవసించిన త్యాగయ్యకు ఆ రాత్రి నారదమహర్షి స్వప్నంలో దర్శనమిచ్చి తాను వదిలిన గ్రంథాలను చదివితే అతని సందేహాలు నివృత్తి అవుతాయని చెప్పి, అతని వల్ల సంగీతానికి అనన్య ప్రచారం జరుగుతుంది అని ఆశీర్వదించాడు.

తంజావూరు మహారాజు శరభోజి తనపై రెండు పాటలు పాడితే పది ఎకరాల పొలం ఇస్తానంటే "నిధి చాలసుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా?..." అని పాడి సున్నితంగా ఆ కానుకలను తిరస్కరించాడు. శరభోజి మహారాజుకు కోపం వచ్చి త్యాగయ్యను బంధించి తెమ్మని భటులను పంపాడు. వెంటనే అతనికి భరించలేని కడుపునొప్పి రాగా జ్యోతిష్కులు జాతకచక్రం పరిశీలించి, మహాత్ముని పట్ల చేసిన అపచారమే కారణమని తేల్చి చెప్పారు. రాజు స్వయంగా త్యాగయ్య వద్దకు వచ్చి క్షమాపణ చెప్పి, అతనిచ్చిన తీర్థం సేవించి స్వస్థుడయ్యాడు.

త్యాగయ్య అన్న జపేశుడికి తమ్ముని వ్యవహారం నచ్చక అతను ఆరాధించే రాముని విగ్రహాలను కావేరిలో పడేశాడు. త్యాగయ్య క్రుంగిపోయి, నిద్రాహారాలు మానివేసి రామనామ జపం చేయగా, శ్రీరాముడు కలలో కనిపించి, కావేరిలో తాను దాగున్న విషయం తెలిపాడు. పరమానందంతో "కనుగొంటి శ్రీరాముని నేడు" అని పాడుకుంటూ విగ్రహాలను తెచ్చుకుని భక్తితో కొలవసాగాడు. చేసిన పాపం అన్న జపేశుణ్ణి ఊరికే వదలక, అతని కుమారుడు ఆడుకుంటూ కావేరీనదిలో పడి మరణించాడు. ఆ దిగులుతో అన్న మంచం పట్టగా, త్యాగయ్య శ్రీరాముణ్ణి ప్రార్థిస్తూ, "ఎన్ని తప్పులు చేసిన వారిని రాజన్య నీవు బ్రోచినావు" అని పాడగా, క్రమంగా జపేశుడు కోలుకున్నాడు. చివరికి అతను కూడా రామభక్తుడిగా మారాడు.

శిష్యులతో కలిసి త్యాగయ్య తీర్థయాత్రలు చేస్తూ తిరుమల చేరుకుని దర్శనానికి వెళ్ళేసరికి తెరపడింది. తన అహంకారమే తెర రూపంగా అడ్డు నిలిచిందని భావించి, వేదనతో "తెర తీయగ రాదా! నాలోని తిరుపతి వెంకటరమణ మచ్చరమను" అని పాడాడు. వెంటనే తెర దానంతట అది తొలగిపోయింది. పుత్తూరులో ఒక ఇల్లాలి పసుపు కుంకుమలు నేల రాలి ఏడుస్తుంటే చూసి చలించిపోయిన త్యాగయ్య "నా జీవన ధార" అనే కీర్తన పాడి, శవంపై తులసి తీర్థం చల్లగానే అతను జీవించాడు. త్యాగయ్య భక్తితో చేసిన అద్భుతాలివి.

శిష్యులతో ముందుగానే చెప్పి యోగసమాధిలో కూర్చొని సిద్ధి చెందాడు త్యాగరాజు. ఇప్పటికీ ప్రతి ఏటా వేల కొలదీ సంగీత ప్రియులు త్యాగరాయ ఆరాధనోత్సవాలకు హాజరవుతారు. వారి దివ్యతేజస్సు సంగీత సామ్రాజ్యాన్ని పాలిస్తోంది. ❖

ఓ మహాత్యాగి ఆత్మకథ

(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

(మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, ప్రవక్త, శ్రేష్ఠసన్యాసి, గురువు, యుగాచార్యుడు, దేవదూత, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వగాయకుడు - ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ తన సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన జీవితానుభవాలను 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.)

(...గత సంచిక తరువాయి)

కలకత్తా కాశీపూర్ ఉద్యానంలో నిర్వికల్ప సమాధి అనుభూతి కలిగింది. ఆ అనుభూతిలో నాకు అసలు శరీరమే లేదని స్ఫురించింది. నా ముఖం మాత్రమే అగుపించసాగింది. గురుదేవులు అప్పుడు పైన గదిలో ఉన్నారు. క్రింది గదిలో నేనీ సమాధి స్థితిలో ఉన్నాను. నేను రోదిస్తూ ఉన్నాను. "నాకు ఏమైంది అసలు?" అన్నాను. పెద్ద గోపాలన్నయ్య (స్వామి అద్వైతానంద) గురుదేవుల గదికి వెళ్ళి, "నరేంద్రుడు విలపిస్తున్నాడు" అని కబురు చెప్పాడు. గురుదేవుల్ని కలిశాక, వారిలా అన్నారు - "ఇప్పుడు నీకంతా తెలిసిపోయింది. కానీ దాని తాళం చెవి మాత్రం నా దగ్గరే ఉంచుకొంటున్నాను." "నాకసలు ఏమయ్యింది?" అని నేను అడిగాను. దానికి ఆయన భక్తుల వైపు తిరిగి, "నిజంగా తాను ఎవరో తెలిసిపోతే నరేంద్రుడు శరీరంలో ఇక ఉండ(లే)డు. కానీ వాడి కళ్ళ మీద ఓ తెర కప్పేశాను లే!" అని అన్నారు.

ఒకరోజు కాశీపూర్ ఉద్యానంలో, శ్రీరామకృష్ణులకు తీవ్ర వ్యాకులతతో నా ప్రార్థనను తెలియజేశాను. ఆ సాయంత్రమే, ధ్యానసమయంలో సంపూర్ణంగా బాహ్య చైతన్యాన్ని కోల్పోయాను; 'అసలు శరీరం ఏ మాత్రమూ లేదు' అని అనుభూతి చెందాను. సూర్యుడు, చంద్రుడు, ఆకాశం, కాలమూ, గాలీ మొదలైనవన్నీ ఒక స్వచ్ఛమైన తేజోరాశి సమూహంగా మారిపోయి, అనంత, అవ్యక్త అజ్ఞేయ బ్రహ్మంలోకి లీనమై పోయాయి; దేహస్పృహ దాదాపు పూర్తిగా మాయమైంది; ఆ పరబ్రహ్మంలో నేనూ లీనమైపోసాగాను... కానీ ఆ సమాధి స్థితి నుండి సామాన్య స్థితికి తిరిగి రావడం కోసం, 'అహం' స్ఫురణ అతి సూక్ష్మంగా మిగిలి ఉంది; ఇలాంటి సమాధి స్థితిలో 'అహం' (నేను), 'బ్రహ్మం' మధ్య గల భేదం పూర్తిగా మాయమవుతుంది. అనంత సాగర జలంలా సర్వం ఏకమైపోతుంది. సర్వత్రా జలమయమే, అన్యమేదీ లేదు. భాష, భావన – సర్వమూ అక్కడ ఓడిపోతాయి. కేవలం అప్పుడే 'అవాఙ్మానస గోచరం' (వాక్కు, మనస్సులకు అందనిది) అనే స్థితి సంపూర్ణంగా సాక్షాత్కరిస్తుంది. ('యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' – తైత్తిరీయ ఉపనిషత్తు)

ఆ అనుభవం తరువాత, ఎన్నిసార్లు ప్రయత్నించినా సమాధి స్థితిని మళ్ళీ పొందలేకపోయాను. శ్రీరామకృష్ణులతో ఈ మాట చెప్పగా, ఆయనిలా అన్నారు– "పగలూ, రాత్రీ నీవు ఆ సమాధి స్థితిలో మునిగిపోతే, జగన్మాత కార్యం సిద్ధించదు కదా! కనుకనే ఆ అనుభూతిని మళ్ళీ నీవు పొందలేవు నాయనా! నీవు వచ్చిన పని ముగించాక, అది మళ్ళీ తిరిగి వస్తుంది." కేవలం అవతార పురుషులు మాత్రమే అలాంటి సమాధి స్థితి నుండి లోకహితార్థమై మామూలు స్థితికి తిరిగి రాగలరని శ్రీరామకృష్ణులు అనేవారు. సాధారణ జీవులైతే తిరిగి రాలేరు; ఆ సమాధి స్థితిలో లీనమైపోయి, 21 రోజులపాటు వారు జీవించి ఉంటారు; తరువాత వారి శరీరం ఎండిపోయిన ఆకులా ఈ సంసార వృక్షం నుండి రాలిపోతుంది.

కాశీపూర్‌లో శ్రీరామకృష్ణులు తమ ఆధ్యాత్మికశక్తిని నాకు సంప్రాప్తింపజేశారు... ఒకరోజు ధ్యానం చేస్తుండగా 'కాళీ' (తరువాత స్వామి అభేదానంద)ని నా చెయ్యి పట్టుకోమని అడిగాను. కాళీ నాతో ఇలా అన్నాడు– "నిన్ను తాకినప్పుడు విద్యుత్ ప్రకంపనం లాంటి శక్తి ఏదో నా శరీరంలోనికి ప్రవేశించడం గమనించాను"...

ఒకరోజు శ్రీరామకృష్ణులు ఓ కాగితం మీద "నరేన్ శిఖ్ఖాదేబె" (నరేంద్రుడు ప్రపంచానికి బోధిస్తాడు) అని వ్రాశారు. కానీ నేను ఆయనతో "అలాంటి దేమీ నేను చేయను!" అన్నాను. అందుకు ఆయన "నీ వేంటి? నీ ఎముకలు కూడా చేస్తాయి!"

అన్నారు. ...ఇక, నేను బోధించే భావాలన్నీ శ్రీగురుదేవుల భావాలను ప్రతిధ్వనించే ప్రయత్నం మాత్రమే! మూలం చూస్తే ఆ భావాలు ఏవీ నావి కావు. నేను పలికే ప్రతి తప్పు, చెడు మాట తప్ప- సర్వదా సత్యమూ, శుభకరమూ అయిన నా ప్రతి పలుకూ, కేవలం ఆయన దివ్యవాణి యొక్క ధ్వని మాత్రమే!...

శ్రీ గురుదేవుల పాదాల వద్ద, మరికొందరు యువకులతో కలిసి నేను ఈ భావాలన్నింటినీ గ్రహించాను. దాదాపు 16 సంవత్సరాల కుర్రవాడిగా ఉన్నప్పుడు ఆయన వద్దకు వెళ్ళసాగాను. మరికొంతమంది కుర్రవాళ్ళు నా కన్నా ఇంకా చిన్నవాళ్ళు, కొందరు పెద్దవాళ్ళు - దాదాపు ఒక డజను కంటే ఎక్కువ మంది; మేమంతా కలిసి ఈ ఆదర్శాన్ని వ్యాపింపజేయాలని సంకల్పించాం. అంత మాత్రమే కాదు, దాన్ని ఆచారణాత్మకం చేయాలి! అంటే అర్థం? "హిందువుల ఆధ్యాత్మికతనూ, బౌద్ధుల దయా కరుణలను, క్రైస్తవుల కర్మకౌశలాన్నీ, మహమ్మదీయుల సౌభ్రాతృత్వాన్నీ- వీటన్నింటినీ మా నిత్య వ్యావహారిక జీవితంలో ఆచరించి చూపాలి. మనమంతా కలిసి ఇప్పుడే, ఇక్కడే ఒక విశ్వజనీన మతాన్ని స్థాపిద్దాం! మనమిక ఆగకూడదు!" అని దృఢకంకణ బద్ధులమయ్యాం!

మా గురుదేవులు తమ చేతులతో ఎన్నడూ ఒక నాణేన్ని స్పర్శించలేక పోయేవారు... కేవలం అమ్మ 'కాళీ' కి నివేదించిన కొంచెం ప్రసాదం, కొన్ని గజాల నూలు వస్త్రం - అంతే ఆయన నిత్యావసరాలు! ఎవ్వరి నుండీ ఏ కానుకలూ స్వీకరించేవారు కాదు. ఆయన చాలా నిష్ఠాపరుడు, ఆ నిష్ఠయే వారిని స్వతంత్రులను చేసింది. భారతదేశంలో ఒక సన్న్యాసి ఈ రోజు ఓ మహారాజుకు మిత్రుడై, అతనితో కలిసి విందు భోజనం చేస్తాడు; రేపు అదే సన్న్యాసి ఒక భిక్షగానితో కలిసి ఉంటాడు. చెట్టు కింద నిద్రిస్తాడు.

శ్రీరామకృష్ణులు నన్ను ఎంతో గాఢంగా ప్రేమించేవారు; దాంతో చాలా మందికి నా మీద అసూయ! ఒక వ్యక్తి శీలాన్ని కేవలం అతణ్ణి ఒకసారి చూడగానే ఆయన పసిగట్టేవారు; తమ అభిప్రాయం ఎన్నడూ మార్చుకునే వారు కాదు! మనం ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని కేవలం మన క్షుద్రబుద్ధి, తర్కం ద్వారా మాత్రమే గ్రహించడానికి ప్రయత్నిస్తాం. ఫలితంగా మన తీర్పు చాలా సార్లు తప్పు అని తెలుస్తుంది. కానీ శ్రీరామకృష్ణులు ఇంద్రియాతీత విషయాల్ని తమ సూక్ష్మ దివ్యదృష్టితో గ్రహించేవారు. శిష్యులలో కొంతమందిని ఆయన తమ 'అంతరంగికులు' (అత్యంత ఆత్మీయులు) అనేవారు; వారికి మాత్రమే ఆయన తన నిజస్వరూప రహస్యాల్నీ, యోగ రహస్యాన్నీ బోధించేవారు. 'బహిరంగుల' (బయటివారి)కు మామూలుగా ఇప్పుడు 'శ్రీరామకృష్ణ బోధనలు'గా పేరు పొందిన కథలు, దృష్టాంతాలు బోధించేవారు. అంతరంగిక భక్తులైన యువకులను తమ భావి ప్రణాళిక (సందేశవ్యాప్తి)కై సిద్ధం చేసేవారు; చాలామంది ఈ యువ శిష్యులను గురించి ఆరోపణలు చేసినా, అవేమీ ఆయన పట్టించుకోలేదు! నాకు ఒక బహిరంగ శిష్యునిపై, (శ్రీరామకృష్ణుల) ఓ అంతరంగిక శిష్యుని కంటే మంచి అభిప్రాయం ఉండవచ్చు; కానీ ఈ అంతరంగ శిష్యునిపై నాకొక గుడ్డి నమ్మకం లాంటి ఆత్మీయుతా, గౌరవమూ ఉన్నాయి - "నన్ను ప్రేమిస్తావా? అయితే నా కుక్కనూ ప్రేమించు" అన్నట్లుగా! ఆ బ్రాహ్మణ పూజారి (గురుదేవులు)ని ప్రాణప్రదంగా ప్రేమించాను, అందువల్ల ఆయన ప్రేమించిన ప్రతి వ్యక్తినీ, విషయాన్నీ నేను ప్రేమిస్తాను! నన్ను స్వేచ్ఛగా వదిలేస్తే, నేనొక ప్రత్యేక సంప్రదాయాన్ని సృష్టిస్తానేమోనని ఆయన భయపడేవారు!

కొంతమందితో ఆయన "ఈ జన్మలో నీకు ఆధ్యాత్మిక ఉన్నతి సిద్ధించదు" అనేవారు; తమ సూక్ష్మ దృష్టితో ప్రతి విషయాన్నీ ఇట్టే గ్రహించేవారు, కనుకనే కొందరి పట్ల ఆయనకు పక్షపాతం ఉన్నట్లుగా అనిపించేది. ఒక శాస్త్రవేత్తలా విభిన్న తరహా వ్యక్తులకు విభిన్న రకాలుగా విలువ, మన్నన ఇవ్వడం అవసరమని ఆయన గ్రహించారు. వారి 'అంతరంగిక' శిష్యులను తప్ప వేరెవ్వరినీ వారి గదిలో రాత్రిపూట నిద్రించడానికి అనుమతించేవారు కాదు. 'శ్రీరామకృష్ణులను చూడని వారు మోక్షం పొందలేరు' అనడం నిజం కాదు; అలాగే ఆయన్ని చూసిన ప్రతి వ్యక్తీ ముక్తుడవుతాడనడమూ సత్యం కాదు! ❖ (సశేషం)

అనుసృజన : స్వామి అర్చనానంద

ఆదర్శ పురుషుడు ఆ జానకీ రాముడు

– ఆకెళ్ల రాఘవేంద్ర

భగవంతుడంటే ఎవరు? ఉన్నతమైన గుణాలనూ, ఉత్తమమైన వ్యక్తిత్వాన్నీ, ఆదర్శాలనూ కలిగినవాడు. మరి మానవుడంటే ఎవరు? ఏవో కొన్ని లోపాలనూ, సహజసిద్ధమైన బలహీనతలనూ, అనవసరమైన భావోద్రేకాలనూ కలిగినవాడు.

మనిషనేవాడు భగవంతుణ్ణి పూజించడం ఎందుకు? తనలోని లోపాల్ని క్రమంగా వదులుకొని ఉత్తమ వ్యక్తిత్వాన్ని సముపార్జించుకొనేందుకు! భగవంతుణ్ణి చేరుకొనేందుకు చేసే సాధన అంటే ఇదే! మానవుడు మహనీయుడిగా మారడమంటే ఇదే! రాముణ్ణయినా, కృష్ణుణ్ణయినా కీర్తిస్తూనే – వాళ్ళేం సాధించారో తెలుసుకొని, వారిలోని భగవదంశలుగా భావించే ఉత్తమోత్తమ గుణాల్ని అందిపుచ్చు కోవడమే మనిషి కర్తవ్యం.

శ్రీరామచంద్రుడు మనందరికీ ఆదర్శ పురుషుడు. ఆయన వ్యక్తిత్వంలోని, మూర్తిమత్వంలోని సుగుణాలను మనలోని ప్రతి ఒక్కరం తెలుసుకోవాలి. మనుష్యులమైన మనమంతా సహజంగా ఏవో కొన్ని లోపాల్ని కలిగి ఉంటాం. కానీ ఎలాంటి లోపాలూ లేని ఉత్తమ వ్యక్తిత్వం ఎలా ఉంటుందో ఒక నమూనాగా నిలిపేందుకు శ్రీరామచంద్రుణ్ణి వాల్మీకి మహర్షి సృష్టించాడు. సంస్కృత రామాయణంలోని అరణ్యకాండలో ప్రథమ సర్గలో ఆదికవి వాల్మీకి, రాముణ్ణి గురించి చెప్పిన ప్రతి ఒక్క మాటా నిజానికి నేటి కాలంలో మనం చెప్పుకొనే ఉత్తమ వ్యక్తిత్వానికి ఉదాహరణగా నిలిచేదే!

“స చ నిత్యం ప్రశాంతాత్మా” అని శ్రీరాముణ్ణి గురించి చెబుతూ వాల్మీకి అంటాడు. అంటే ‘ఆ రాముడు ఎప్పుడూ తన మనస్సులోని ప్రశాంతతను పోగొట్టుకోడు’. అంతేకాదు శ్రీరాముడు మధురభాషి, పూర్వభాషి అంటాడు. అంటే మధురంగా మాట్లాడేవాడు. పైగా ఎవరైనా ఎదురుపడితే ఎలాంటి అహాన్నీ ప్రదర్శించకుండా తానే ముందు మాట్లాడేవాడు.

“సానుక్రోశ జితక్రోధ...”, “...నిత్యం ప్రగ్రహవాన్..” అని రాముణ్ణి వాల్మీకి అభివర్ణించాడు. అంటే – రాముడు కోపాన్ని అధిగమించినవాడట, భావోద్రేకాలపై తనకు తానే నియంత్రణ కలిగి ఉన్నవాడట!

అలాగే, ఎవరు ఎంత పరుషంగా మాట్లాడినా శ్రీరామచంద్రుడు మృదువుగా సమాధానం చెప్పేవాడు. చూసీ చూడడం తోనే ఎదుటి వారి మనస్సును ఇట్టే కనిపెట్టే సమర్థుడు. మరుపులేనివాడు. మనుష్యుల్ని గానీ, వారి పేర్లను గానీ, సంఘటనల్ని గానీ, సహాయం చేసిన వారిని గానీ, సాయం చేస్తానన్న వాగ్దానాన్ని గానీ – రాముడు ఎట్టి పరిస్థితుల్లోనూ మరిచిపోడు.

అంతేకాదు – హావభావాల ద్వారా తన మనస్సులో ఏముందో ఇతరులకు తెలియ నిచ్చేవాడు కాదు. అదే సమయంలో ఇతరుల హావభావాల ద్వారా వారి స్థితిగతులను స్పష్టంగా అంచనా వేయగలిగేవాడు. ఒక్క అనవసరమైన మాటను కూడా పలికేవాడు కాదు. ఏమరు పాటుగా, ఉదాసీనంగా ఉండడం రాముడి వ్యక్తిత్వంలో ఏ కోశానా కనిపించదు. తన వల్ల ఏదైనా పొరపాటు కానీ, తనలో ఏదైనా లోపం కానీ ఉంటే ఇట్టే గుర్తించే తత్త్వం రాముడిది. అంతేకాదు అలా గుర్తించిన లోపాన్ని వెనువెంటనే సరిదిద్దుకొనేవాడు.

చూడగానే మనుష్యుల తారతమ్యాల్ని ఇట్టే తెలుసుకొనే నేర్పరి రాముడు. ఎవర్ని అయినా చేరదీయడంలో కానీ, అలా చేరదీసినవారిని ఆదరించడంలో గానీ అతి సమర్థుడు. పెద్దలతో స్నేహం చేయడంలోనూ, స్నేహం చేసిన పెద్దల్ని నిలుపుకోవడంలోనూ సమర్థుడు. ధనార్జన ఎలా చేయాలో తెలుసు. ఆ డబ్బును ఎలా శాస్త్రీయంగా వ్యయం చేయాలో తెలుసు. ‘ఆయ కర్మాణి ఉపాయజ్ఞ సమదృష్టత్ వ్యయ కర్మవిత్’ ధనాన్ని అయిదు భాగాలు చేసి – ఒక్కో భాగాన్నీ వరుసగా – ధర్మం కోసం, యశస్సు కోసం, లౌకిక అవసరాల కోసం, తన కోసం, తన బంధు మిత్రుల కోసం ఖర్చు పెడతాడు రాముడు.

రాముడిలోని ఇన్ని గుణాలు చదువుతూ ఉంటే మనకేం అనిపిస్తోంది? రాముడు ఆజానుబాహుడనీ, అరవింద దళాయతాక్షుడనీ, నీల మేఘశ్యాముడనీ, బాహ్యసౌందర్యాన్ని మాత్రమే వర్ణించి ఊరుకోకుండా వ్యక్తిత్వ సుగుణాలనూ,

అంతఃసౌందర్యాన్నీ వాల్మీకి ఉద్దేశపూర్వకంగా ఎందుకు వర్ణించినట్లు? ఎందుకంటే ఉత్తమ వ్యక్తిత్వం, ఉన్నత శీలం అనేవి ఇదిగో ఇలా ఉంటాయని, వాటినన్నిటినీ తనలో ఇముడ్చుకొని, ఆచరించిన ఘనుడు శ్రీరామచంద్రుడనీ, ఆయనను ఆదర్శంగా తీసుకోవడమంటే అర్థం – ఆ ఉన్నత వ్యక్తిత్వాన్ని అందిపుచ్చుకోవడమేననీ వాల్మీకి విస్పష్టం చేసినట్లయింది.

ఏ మాత్రం కోపం లేని వ్యక్తిత్వం రాముడిది. ఆవేశానికీ, ఆందోళనకూ గురి కావడం రాముడిలో ఏ కోశానా కనిపించదు. ఇందుకు ఎన్నో దృష్టాంతాలు వాల్మీకి రామాయణంలో కనిపిస్తాయి. సీతారాముడికి పట్టాభిషేకం చేయాలని దశరథుడు నిర్ణయించుకొన్నాడు. అంగరంగ వైభోగంగా అయోధ్య పట్టణాన్నీ, పట్టాభిషేక వేదికనూ తీర్చిదిద్దారు.

కానీ అంతలో మంథర కుతంత్రం, కైక కుయుక్తులతో పట్టాభిషేకం రద్దయ్యే పరిస్థితి తలెత్తింది. ఈ విషయం ఇంకా వశిష్ఠుడు తదితరులకు తెలీదు. పట్టాభిషేకానికి అంతా సిద్ధం అని దశరథుల వారికి చెప్పమంటూ సుమంత్రుణ్ణి వశిష్ఠ మహర్షి పంపారు. దశరథుడు, కైక ఉన్న అంతఃపురానికి సుమంత్రుడు వెళతాడు. రాముణ్ణి తీసుకురమ్మని సుమంత్రుడితో కైక అంటుంది. దాంతో తిరిగి సుమంత్రుడు సీతారాములు ఉన్న మందిరానికి వెళ్ళి విషయం చెబుతాడు.

అప్పుడు రాముడు దశరథుడి దగ్గరకు వెళ్ళేసరికి దశరథుడు అక్కడ విషణ్ణవదనంతో ఉన్నాడు. జరగరానిదేదో జరిగిందని ఇట్టే పసిగట్టాడు రాముడు. ఆ విషయమే కైకను అడిగాడు రాముడు. అప్పుడు కైక "రామా! పూర్వం మీ తండ్రి గారు నాకు రెండు వరాలు ఇచ్చారు. అందుకు గాను ఇప్పుడు నేను భరతుడికి పట్టం కట్టమనీ, నిన్ను 14 ఏళ్ళు వనవాసం పంపమనీ కోరాను. మీ తండ్రిగారు అంగీకరించినట్లే ఉన్నారు" అని పలికింది.

పిడుగు లాంటి ఈ మాటలు వింటే ఎంతటివారికైనా గుండె లయ తప్పుతుంది. క్షణికావేశం గుండెల్లో నుంచి తన్నుకు వస్తుంది ఎంతో సంబరంతో ఉన్న యువకుడికి ఇలాంటి వార్త పట్టలేనంత క్రోధానికి కారణం అవుతుంది. కానీ రాముడికి ఇవేమీ కాలేదు.

అదీ రాముడిలోని స్థితప్రజ్ఞత. భావోద్రేకాలపై నియంత్రణ. క్షణికావేశానికి లోనుకాని గుండె నిబ్బరం. ఇలాంటి శ్రీరామచంద్రుడి ఉత్తమ వ్యక్తిత్వావిష్కరణ ఘట్టాలు వాల్మీకి రామాయణంలో ఎన్నో! ఆ సారాన్ని గ్రహించి మనమూ ఆదర్శనీయ వ్యక్తిత్వాన్ని అందిపుచ్చుకోగలగాలి. ❖

గుణవంతులవుదాం!

– ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి



కులములోన నొకడు గుణహీనుడుండిన
కులము చెడును వాని గుణము వలన
ఎలమి చెఱకు నందు నెన్ను పుట్టిన రీతి
విశ్వదాభిరామ వినురవేమ!

భావం : మంచి చెఱకుగడలో పురుగు పుట్టి చెఱకును పాడుచేసిన విధంగా కులంలో ఒక వ్యక్తి దుర్గుణుడైతే వాని వలన ఆ కులానికి చెడ్డ పేరు వస్తుంది.

వ్యాఖ్య : ఈ రోజుల్లో ఒక వైపు కుల రహిత సమాజ మంటూనే, కులాల పోరాటాలు, కులం పేరిట రాజకీయాలు కొనసాగిస్తున్నారు. ఎక్కువ కులం, తక్కువ కులం అనే భేదాలతో భారతీయుల్లో అనైక్యత పెరుగుతున్నది. కులం బలహీనుణ్ణి బలవంతునిగా చేయాలి. కానీ నేడు బలవంతుణ్ణి బలహీనపరుస్తున్నది. అందరి కన్నా తామే గొప్ప అనుకోవడం, మిగతా వారిని తక్కువగా చూడడం జరుగుతున్నది. దాని కారణంగా పొరపొచ్చాలు పెరుకుంటున్నాయి.

'గుణవంతుని వల్ల కులం వికసిస్తుంది. గుణహీనుని వల్ల కులం చెడిపోతుంది. కాబట్టి గుణం ప్రధానం కానీ కులం కాదు'అని వేమన అన్నాడు.

గుణవంతులతోకూడిన సమాజం కావాలి. 'శ్రేష్ఠుడు ఏ కర్మలు చేస్తాడో ఇతరులు వాటినే అనుసరిస్తారు' అని గీతాచార్యుడు అన్నాడు. విషాదంలో పడ్డ అర్జునుడు అవకతవకగా ప్రసంగిస్తూ ప్రజ్ఞావాదం చేయడం మొదలు పెడితే ఈ అనార్య లక్షణం నీకెక్కడి నుండి దాపురించింది అన్నాడు. మనం ఆర్యులం (శ్రేష్ఠులం–గుణవంతులం) కావాలని గీత బోధిస్తున్నది.

కుటుంబ వికాసానికీ, సమాజం చైతన్య శీలం కావడానికీ, దేశం ప్రపంచంలో తల ఎత్తుకొని నిలవడానికీ మనం గుణవంతులం కావాలి. ఇదే యోగి వేమన సందేశం. ❖

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

చందు, హైదరాబాద్.

ప్రశ్న : నేను డిగ్రీ చదువుతున్నప్పుడు ఎన్నో కష్టాలు ఎదుర్కోవలసి వచ్చింది. అందువల్ల మానసికంగా చాలా క్రుంగిపోయాను. నిరాశకు గురయ్యాను. ఇప్పుడు ఏం జరిగినా 'అంతా నా తలరాత (fate)' అని ప్రతీ విషయాన్నీ తేలిగ్గా తీసుకుంటున్నాను. ఇది ఎంతవరకు సమంజసం?

జవాబు: జీవితంలో ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా అవి మన ప్రారబ్ధం (fate) వల్లనే అని భావించి, కష్టాల్ని సైతం సంతోషంగా భరించేవారు ఉత్తమ కోవకు చెందుతారు. ఇలాంటి మహాత్ములు 'ఆయన ఆజ్ఞ లేనిదే ఆకు అయినా కదలదు' అని భగవంతుని పై సంపూర్ణ విశ్వాసంతో ఉంటారు. వీరు ఎలాంటి పరిస్థితుల్లోనూ నిరాశ చెందరు, ఇతరులను నిందించరు.

అలాంటి స్థితికి మనం చేరే వరకూ 'అంతా మన తలరాత' అని కూర్చోవడం ఎంతమాత్రం సమంజసం కాదు. అలా చేయడం వల్ల మన బాధ్యతల్ని విస్మరించి, బలహీనతల్ని సమర్థించుకున్న వారమవుతాం.

Men in general lay all the blame of life on their fellowmen, or failing that, on God... and say it is fate. Where is fate, and who is fate? We reap what we sow. We are the makers of our own fate.

- Swami Vivekananda

సాధారణంగా మనలాంటివారు కష్టాలు ఎదురైనప్పుడూ, సమస్యల్ని పరిష్కరించుకోలేనప్పుడూ నిరాశకుగురై 'అంతా మన తలరాత, ఎలా జరగాల్సింది అలా జరుగుతుంది' అని మెట్ట వేదాంతం వల్లిస్తారు. అది మనలోని పిరికితనానికీ, సోమరితనానికీ నిదర్శనం. మన వైఫల్యాలకు మన చుట్టూ ఉన్న మనుష్యుల్నీ, పరిస్థితుల్నీ, చివరికి దేవుణ్ణి నిందించడానికి కూడా వెనుకాడం. ఇది మానవ నైజం.

'మనం ఉన్న పరిస్థితులకు మనమే కారకులం. ఆ పరిస్థితుల్ని మార్చుకోగల శక్తి కూడా మనలోనే ఉంది' అని అంటారు స్వామి వివేకానంద.

'This misery that I am suffering is of my own doing, and that very thing proves that it will have to be undone by me alone'. Therefore, stand up, be bold, be strong. Take the whole responsibility on your own shoulders... *- Swami Vivekananda*

మనం నిరాశకు గురవడానికి కారణం, మనకు ఎదురైన కష్టాల్ని భూతద్దంలో చూసి భయపడడం వల్లనే! కానీ ఆ కష్టాలే మనకు గుణపాఠాలు నేర్పే గురువులుగా భావించగలిగితే మన తలరాతను తిరగరాయవచ్చు. అప్పుడు సమస్యల్ని సానుకూలంగా స్వీకరించి, జీవితాన్ని ఆస్వాదించవచ్చు.

Worry is like a microscope. It makes every little misery look huge. We can use a telescope, and see far away into life. We shall see much, but worry we shall hardly notice. we shall find it so small. *- Nicholas Rodery*

నిజానికి మనకు ఎదురైన కష్టాలు మనల్ని మానసికంగా దృఢతరం చేయడానికి తోడ్పడతాయి. అందుకే 'ఈ ప్రపంచం మనల్ని మనం దృఢంగా మార్చుకోవడానికి ఉపయోగపడే ఓ వ్యాయామశాల లాంటిది' అని అంటారు స్వామి వివేకానంద.

కాబట్టి మనకు కలిగిన కష్టనష్టాలకు నిరాశ చెందకుండా, దృఢ చిత్తంతో వాటిని విజయ సోపానాలుగా మలచుకోగలిగిన నాడు మన తలరాతతోపాటు ఇతరుల తలరాతను (కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం) కూడా మార్చగల శక్తి వస్తుంది. అప్పుడే "నా తలరాతను నేనే మార్చుకోగలను అని ధైర్యంగా పలికినవాడే నిజమైన బలవంతుడు" అన్న స్వామి వివేకానంద మాటల్ని నిజం చేయగలుగుతాం. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :

యువవాణి

శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029



ఇబ్బందులు ఉపాయాలు

– స్వామి సేవ్యానంద

మన జీవితం ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సవ్యంగా సాగిపోవాలని కోరుకుంటాం. అయితే ఇది ఎన్నటికైనా సాధ్యమా? "మానవ జన్మ కష్టాలతో నిండి ఉంటుంది. మనం భగవంతుని నామాన్ని స్మరిస్తూ ఓర్పుతో ముందుకు సాగిపోవాలి. మానవ రూపంలో అవతరించినప్పుడు భగవంతుడు కూడా ఈ కష్టాలను తప్పించుకోలేడు" అని శ్రీ శారదాదేవి చెబుతారు. మనకు ఇబ్బందులు తప్పనిసరి కాబట్టి వాటిని ఎలా ఎదుర్కొనగలమన్న విషయాన్ని ఆలోచిద్దాం.

1. మానసిక బలాన్ని పెంచుకోవాలి :

ఇబ్బందులు వచ్చినప్పుడు చాలామంది మానసికంగా బలహీనులవుతారు. మానసికంగా బలహీనులైన వీరు సరైనరీతిలో ఆలోచించలేక ఇతరుల ఆలోచనలపై, సలహాలపై ఆధారపడి వాళ్ళ చేతుల్లో కీలుబొమ్మల్లా తయారవుతారు. ప్రతికూల ఆలోచనలకూ, ప్రతికూల శక్తులకూ బానిసలవుతారు. చివరికి ఉన్న కష్టాలను మరింత పెంచుకొని వాటినుంచి బయటపడే అవకాశాలకు దూరమవుతారు. అందుకే ఇబ్బందులు వచ్చినపుడు మనం మానసిక బలాన్ని పెంచుకొని, ధైర్యంగా ఉండడానికి ప్రయత్నించాలి.

"నేను ఆలోచనలను (ఐడియాస్) మాత్రమే ఇవ్వగలను. వ్యక్తులు తమకు యుక్తమైన రీతిలో వాటిని మలచుకొని ఆచరించవలసి ఉంది" అని స్వామి వివేకానంద చెబుతారు. మనం ఇతరుల అభిప్రాయాలను, సలహాలను స్వీకరించే ముందు వాటి మంచీ చెడులను జాగ్రత్తగా ఆలోచించి, చివరికి మనంతట మనమే ఒక మంచి నిర్ణయం తీసుకోవాలి. కలుషితమైన మనస్సు సరైన నిర్ణయాలను తీసుకోలేదు. అందుకే, ముందుగా మనస్సును మన ఆధీనంలో ఉంచుకునే ప్రయత్నం చేయాలి. తరువాత ఉపాయాలు వాటంతటవే వస్తాయి.

2. అహంకారాన్ని వదిలి, ఉపాయాన్ని ఆలోచించాలి: రెండు ఎత్తైన కొండలను కలుపుతూ సన్నని వంతెన ఒకటి ఉంది. ఓ రోజు ఒక కొండపై నివసిస్తున్న ఒక గొఱ్ఱె రెండవ కొండకు వెళ్ళాలని వంతెన పైన నడవడం ఆరంభించింది. అదే సమయంలో మరొక గొఱ్ఱె రెండవ కొండ మీద నుంచి రావడం ఆరంభించింది. ఈ రెండు గొఱ్ఱెలు వంతెన మధ్యలో ఎదురయ్యాయి. ఆ వంతెన చాలా ఇరుకైనది కావడంవలన ఒక గొఱ్ఱె పక్కనుంచి మరొకటి వెళ్ళే అవకాశం లేదు. అవి వెనక్కి తిరిగి వెళ్ళే అవకాశం అంతకంటే లేదు. రెండవ గొఱ్ఱె చాలా కోపంతో "నీవు నా మార్గానికి ఎందుకు అడ్డు వస్తున్నావు? నా మార్గం నుంచి తప్పుకో!" అని అంది. మొదటి గొఱ్ఱె "నేను ముందుగా ఈ వంతెనపై అడుగు వేసాను. కాబట్టి ఈ వంతెనను ముందుగా దాటే అధికారం నాకుంది" అని అంది. ఇలా వాదోపవాదాలు పెంచుకొని, అవి పోట్లాడుకోనారంభించాయి. ఆ ఇరుకైన వంతెన మీద తెలివి తక్కువతనంతో పోట్లాడుకున్న గొఱ్ఱెలు కొద్దిసేపట్లోనే క్రిందపడి ప్రాణాలను కోల్పోయాయి.

కొన్ని రోజుల తరువాత అనుకోకుండా మరొక రెండు గొఱ్ఱెలు ఆ వంతెన రెండు వైపుల నుంచీ రావడం జరిగింది. వంతెన మధ్యలో మరలా రెండూ ఎదురయ్యాయి. ఈ సారి మొదటి గొఱ్ఱె చాలా వినయంగా "నన్ను క్షమించు! నీవు ఇటువైపు వస్తున్నట్లుగా నాకు తెలిసేసరికి చాలా ఆలస్యమయింది" అని అంది. సమాధానంగా రెండవ గొఱ్ఱె "మనం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ముందుగా భగవంతుణ్ణి ప్రార్థించి, ఉపాయం గురించి ఆలోచించాలని పెద్దలంటారు. ప్రతి ఇబ్బందికీ ఉపాయం ఉండే తీరుతుంది" అని అంది "ఇప్పుడు ఉపాయం ఏమిటి?" అని మొదటి గొఱ్ఱె అడిగింది. "నేను ఇక్కడ కూర్చుంటాను. నీవు జాగ్రత్తగా నా మీద నుంచి నడిచి వెళ్ళిపో. తరువాత నా మార్గంలో నేను వెళ్తాను" అని రెండవ గొఱ్ఱె అంది.

మనం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అర్థంలేని అహంకారాలకు, పంతాలకు పోతే చివరికి నష్టపోయేది మనమే! అందుకే, భగవంతుణ్ణి శరణు వేడి శాంత భావంతో సరైన ఉపాయం కోసం ఆలోచించాలి. ❖

తడబడుతున్న తరుణి అడుగులు

– బి. సైదులు

అపార సహనానికీ, అంతులేని త్యాగానికీ చెరగని చిరునామా మన స్త్రీమూర్తి. జీవితంలో ఏ పాత్రను పోషించినా ఆ పాత్రకు పరమపవిత్రతను ప్రసాదించగలదామె. కానీ ఆధునిక ఆకర్షణల ప్రభావంతో అంతటి ఘన చరిత కలిగిన భారతావని వనిత అడుగులు కూడా తడబడుతున్నాయి. ఏదో పొందాలన్న తపనతో, ఎంతో పోగొట్టుకుంటున్న అయోమయం; దాహం తీరాలన్న తపనతో తేనె వెంట పరుగులు పెడుతున్న అమాయకత్వం ఎంతో మంది వనితల జీవితాల్ని కబళించివేస్తున్నాయి. సమాజంలో మగవారి తీరుతెన్నులు దారితప్పినా ఆ పరిణామం అంత ప్రభావాన్ని చూపదు. అయితే, అదే మగువల నడత కాసింత సడలినా వ్యవస్థ పతనావస్థకు దారితీస్తుంది. నార చీరలు ధరించి, కాలమంతా కానల్లోనే గడిపిన పరమపావని జానకీమాత మనకు ఆదర్శం కానీ, నిలువెత్తు నగలతో చీనీచీనాంబరాలతో విరాజిల్లి, సుఖాల్లో తేలి మట్టిలో కలిసిపోయే మహారాణులు కాదు! నేటికీ మేటి విలువలతో వెలిగిపోతున్న మహిళామణులూ ఉన్నారు; వారికి సమాజం శిరస్సు వంచి ప్రణామాలు అర్పిస్తుంది; కాని ఆధునికత హంగుల పేరుతో జీవితాల్ని కుంగదీసుకుంటున్న వారే అధికం. చీరలు, ఛానళ్లే జీవితం కాదు; అంతకు మించిన గురుతర బాధ్యతలు ఎన్నో ఉన్నాయని అతివలు గుర్తించాలి.

ఇల్లంటే ఇల్లాలే...

న గృహం గృహమిత్యాహుః గృహిణీ గృహముచ్యతే
గృహం తు గృహిణీ హీనమ్ అరణ్యసదృశం మతమ్...

ఇల్లాలు లేని ఇల్లు ఇల్లే కాదు; ఆమే నిజమైన ఇల్లు; ఇల్లాలు లేని ఇల్లు అడవితో సమానం... అంటోంది మహాభారతం. నిజమే కుటుంబపు రూపురేఖలు, శాంతిసౌభాగ్యాలన్నీ ఇల్లాలిపైనే ఆధారపడి ఉంటాయి. అయితే ఈతరంలో చాలా మంది మహిళలు దురదృష్టవశాత్తూ కుటుంబ నిర్వహణకు అంత ప్రాధాన్యాన్ని ఇవ్వడం లేదు. అందుకే చాలామంది ఇళ్ళలో ఆడంబరాలు, ఆర్భాటాలయితే కనిపిస్తున్నాయి; కానీ ఆహ్లాదాలు, ఆనందాలు కొరవడుతున్నాయి. చాలా మంది మగువలు సహనం కన్నా సాధింపులకు, బాధ్యతలకన్నా హక్కులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు; గడప దాటితే తప్ప తమకు గుర్తింపు లభించదను కుంటున్నారు. ఫలితంగానే కనీసం కన్నబిడ్డలకు కూడా మగువ మార్గదర్శకత్వాన్ని వహించలేకపోతోంది. ఉద్వేగ, ఉద్రేకాలకు లోనవుతూ తమకు తామే కాకుండా, చివరికి తమవారికి కూడా స్త్రీలు సమస్యలా తయారవుతున్నారు.

శిల్పివంటిది స్త్రీమూర్తి...

women are the real architects of society అంటాడు హోరియర్ అనే ఆంగ్ల మేధావి. ప్రత్యక్షంగా కనిపించకపోయినా విలువలతో కూడిన వ్యవస్థ రూపుదిద్దుకోవడానికి పరోక్షంగా మహిళల ప్రాతినిధ్యం మరపురానిది! అత్యంత దార్ఢ్యాన్ని ప్రదర్శించిన వారి సతీమణులు కూడా పరమోన్నతంగా పాతివ్రత్యాన్ని ఆచరించి, ధర్మమూర్తులుగా ఎదిగిన ధన్యభూమి మనది! లంకేశ్వరుడయిన రావణాసురుడి అర్ధాంగి మండోదరి నుంచి రాజాధిరాజైన దుర్యోధనుడి పట్టపురాణి భానుమతి వరకు ఎంతో మంది తమ భర్తల దుశ్చర్యలను బహిరంగంగా వ్యతిరేకించిన వారే! 'శుభకర్మలు చేసినవారికి ఉత్తమఫలాలు, పాపకర్మలు చేసిన వారికి పాపఫలాలు తప్పవు'అంటూ రావణుడిని తీవ్రంగా హెచ్చరిస్తుంది రామాయణంలో మండోదరి.

మరి నేడు ఎంతో మంది ఆధునిక మహిళలు తమ గొంతెమ్మ కోరికలతో పరోక్షంగా పురుషులు అడ్డదారులు తొక్కేందుకు కారణమవుతున్నారు.

విరామాలతో వికృత ఆలోచనలు...

సహజంగా సున్నితమైన స్త్రీల మనస్సు ఆరోగ్యకరమైన వ్యాపకాలు, అభిరుచులు లేకపోవడం వలన బలహీనంగా మారిపోతుంది. ఆ ప్రభావంతో వేసే తప్పటడుగులు జీవితాంతం వెన్నాడుతూ ఉంటాయి. పురుషుడి కన్నా స్త్రీ మరింత అప్రమత్తంగా ఉండటం అవసరం. జీవనవేగంలో మగవారు తమ తప్పిదాలను సులభంగా మరచిపోగలరు. కానీ భారతీయ స్త్రీ సంస్కారం తన పొరపాట్లను విస్మరించనీయదు; అందుకే పశ్చాత్తాపాలకు అవకాశం లేకుండా ఆచితూచి మగువలు మసలుకోవాలి. మరోవైపు గృహంలో ఆధునిక సౌకర్యాలు, సౌలభ్యాలు ఎక్కువ కావడంతో గృహిణులకు విరామసమయం పెరిగిపోతోంది. ఫలితంగా మనస్సు వ్యాపకాల కోసం వెంపర్లాడుతుంది. అలాంటి సమయంలో మనస్సు ఏ విషయంపై కేంద్రీకృతమవుతుందన్నదే ప్రధానం.

దారి తప్పిస్తున్న ధారావాహికలు...

ప్రధానంగా టీవీ వంటి ప్రసార ప్రచార మాధ్యమాల వల్ల మగువల మనస్సు మరలితే ఆ దుష్ప్రభావం గురించి ఇక చెప్పనక్కర లేదు. ఏదైతే వీక్షిస్తామో, దానినే ఆలోచిస్తాం; ఏ విధంగానైతే ఆలోచిస్తామో, ఆ విధంగానే ఆచరిస్తాం. శూర్పణఖలనే కథానాయికలుగా తీర్చిదిద్దుతున్న నేటి సీరియళ్ళు ఎంతో మంది మహిళలపై విస్తృతంగా, వికృతంగా ప్రభావాన్ని చూపుతున్నాయి. ఫలితంగా కారుణ్యమూర్తులయిన స్త్రీలు పరమకాఠిన్యంగా మారిపోతున్నారు. ఇలా పైశాచిక ఆలోచనలు నిండిన వనితలు జన్మనిచ్చే బిడ్డలు కూడా అలాంటి లక్షణాలతోనే ఈ ప్రపంచానికి పరిచయం అవుతారు; నేరప్రవృత్తిని పుణికి పుచ్చుకుంటారు. అందుకే స్వామి వివేకానంద అంటారు 'తల్లి పూజలతో, ప్రార్థనలతో పుట్టిన బిడ్డలే శ్రేష్ఠులు'.

ఆశల వెంట అతివల పరుగు...

'ఈ ప్రపంచంలోని వనరులు మన అవసరాల్ని మాత్రం తీర్చగలవు; కానీ మన అంతులేని ఆశలను మాత్రం సంతృప్తి పరచలేవు' అంటారు మహాత్మాగాంధీ. ముఖ్యంగా నేడు ఎంతో మంది మహిళామూర్తుల కోర్కెలు, స్వార్థపు ఆలోచనలు మాత్రం కళ్ళాలు లేని గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయి. అంతర్గతంగా ఉన్న అశాంతిని, అసంతృప్తిని బాహ్యమైన వస్తువుల ద్వారా పరిహరించాలనుకుంటున్నారు. ఫలితంగా వారి జీవితాలు పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్లవుతున్నాయి. ఎంత పెద్ద మేడలో ఉన్నా, ఎన్ని ఆభరణాలు ధరించినా, ఎన్ని పట్టుచీరలు కట్టుకున్నా లభించని ఆనందం, సంతృప్తి, గౌరవం నలుగురు అనాథలను ఆర్తిగా అక్కున చేర్చుకొని, అన్నం పెడితే లభిస్తాయని తెలుసుకోవాలి. పరాయి బిడ్డలపై మీరు చూపే కాస్తంత కరుణ మీ పిల్లలపై సహస్రాధికంగా ఆశీస్సుల రూపంలో వర్షిస్తుందని, కష్టాల నుంచి కాపాడుతుందని గుర్తుంచుకోవాలి. భగవంతుడు కురిపించే ప్రేమామృతానికి స్త్రీ హృదయాన్ని పాత్రగా ఎంచుకుంటాడని గ్రహించాలి.

తేనెతో తీరదు దాహం

తృప్తిని మించిన సంపద, ఓరిమితో సమానమైన సద్గుణం లేదంటారు శారదామాత. దాహం తీరాలంటే నీరు తాగితే సరిపోతుంది; తేనెతో పని లేదు. దురదృష్టవశాత్తూ నేడు ఎంతో మంది అతివలకు తాము నేర్చుకున్న చదువు ఈమాత్రం సత్యాన్ని కూడా బోధించలేకపోతోంది. మన అమ్మలు, అమ్మమ్మలు ఏ పట్టాలు పుచ్చుకున్నారని అంత నిబ్బరంగా కష్టాల్నీ, కడగండ్లనూ ఎదుర్కొన్నారు? జటిలమైన సమస్యల నుంచి కూడా సునాయాసంగా బయటపడగలిగారు? కేవలం వారు జీవితాన్ని వాస్తవంగా తీసుకున్నారు; గులాబీ కావాలనుకుంటే ముళ్ళగాట్లకూ సిద్ధమయ్యారు. కానీ నేటి తరంలో కొందరు స్త్రీమూర్తులు అంత ఉదాత్తంగా ఆలోచించ లేకపోతున్నారు. భర్త అధికంగా సంపాదించాలనీ ఉంటుంది; అత్యధిక సమయం కుటుంబంతో గడపాలనీ ఉంటుంది! ఈ రెండు ఎలా సాధ్యం? అందుకే జీవిత పరిధిని విశాలం చేసుకోవాలి; ఒక స్థాయిలో భర్త, పిల్లలు, కుటుంబం దాటుకొని ఉన్నతంగా ఎదగాలి. ఇలా పవిత్రతకు ప్రతిరూపంగా, నిస్వార్థానికి నిలువుటద్దంగా, సహనమే శిరోధార్యంగా, అచంచల ఆత్మవిశ్వాసంతో జగజ్జననికి ప్రతీకగా నిలిస్తే ఆ స్త్రీమూర్తి పాదాలకు లోకమంతా వినమ్రంగా ప్రణమిల్లుతుంది. ❖

నిస్వార్థసేవలో తరించిన నివేదిత

భారతదేశ ప్రజలను తన సొంత బిడ్డల్లాగ భావించి వారి సేవలో తన జీవితాన్ని నివేదించిన త్యాగశీలి సోదరి నివేదిత. కుటుంబ పరిధిని దాటి దేశమంతా విస్తరించిన అలాంటి మాతృప్రేమను మేము ఇంతవరకూ చవిచూడలేదు. విదేశీయురాలైనప్పటికీ స్వామి వివేకానంద శిష్యురాలిగా తన కరుణాంతరంగంతో, సేవాతత్పరతతో అట్టడుగు ప్రజానీకాన్ని కూడా ఆకట్టుకోగలిగారామె. – *రవీంద్రనాథ్ టాగూర్*

అల్పంలోనే ఆనందం

– స్వామి రఘునాయకానంద



ఇద్దరు ప్రయాణికులు రైలులో ప్రయాణిస్తున్నారు. వారు వెళ్ళాల్సిన ఊరు ఒక్కటే. రైలు వెళుతూ ఉంది. దిగవలసిన ఊరు రానే వచ్చింది. ఇద్దరూ తమ తమ సామాన్లతో దిగడానికి సమాయత్తం అవుతున్నారు. ఒకతను దిగడానికి అధిక ప్రయాసలు పడుతున్నాడు. కారణం అతని దగ్గర చాలా సంచులు ఉన్నాయి. రెండవ ప్రయాణికుడు మాత్రం చక్కగా ఒక బ్యాగ్‌తో చకచకా దిగేస్తున్నాడు. కారణం ఏమిటో తెలుసా? అది మనందరికీ తెలిసిన ఒక నానుడి:'Less luggage more comfort- తక్కువ సామాన్లతో చేసే ప్రయాణం అధిక సుఖవంతం'. జీవితంలో చక్కటి గుణపాఠం నేర్పే జాతీయం ఇది.

ఈ రోజు మనిషి దగ్గర ఎన్నో వస్తువులు ఉన్నాయి. కారు, మోటార్ సైకిల్, టీ.వీ, భవనం, సెల్‌ఫోన్, కంప్యూటర్, పెద్ద బ్యాంక్ అకౌంట్‌లతో పాటు మంచి డిగ్రీలు, బిరుదులు. వీటిని సాధించడానికి చేసే ప్రయత్నంలో మనిషి స్వాతంత్ర్యాన్ని కోల్పోతున్నాడు. ఒక కళాశాల విద్యార్థి తాను చదువుకొనే దశలో ఎంత స్వతంత్రుడుగా ఉంటాడో ఆలోచించండి. ఎప్పుడైనా ఎక్కడకైనా వెళ్ళాలన్నా తన సంచీలో రెండు మూడు జతల బట్టలు సర్దుకొని హాయిగా బయలుదేరిపోతాడు. ఈ యువకుడే ఒక ఉద్యోగం సంపాదించి, తన కుటుంబాన్ని పోషించవలసి వచ్చినప్పుడు అతడు కుటుంబపోషణకు ఇంకా ఇంకా సంపాదించాలన్న ఆతురత, ఆరాటం, చింతలు ఆ యువకుడికి అప్పటి వరకు ఉన్న స్వాతంత్ర్యాన్ని కోల్పోయేలా చేస్తాయి. ఉన్నదానితో జీవిస్తూ మంచి వ్యక్తిగా మారడం పోయి వీటి కోసమై పరుగులు తీయడంలో నైతిక విలువలను మరిచిపోయే స్థితికి దిగజారుతున్నాడు. మంచితనం, మానవత్వం, నిజాయతీ ఇవే మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్దేవి అన్న విషయంలో స్పష్టమైన అవగాహన లేకపోవడమే దీనికి కారణం. ఒక కార్యం సాధించడానికి మంచి మనస్సు, మంచి హృదయం అవసరం కానీ సంపద కాదు అంటారు స్వామి వివేకానంద.

నైతిక విలువలను ఆచరిస్తూ పదిమందికీ ఆదర్శంగా ఉండవలసింది పోయి ఇంకా సంపాదించాలని లంచాలు తీసుకొని అవినీతి నిరోధక శాఖ వారికి పట్టుబడే ఉద్యోగులను వార్తాపత్రికలలో ఎంతమందిని చూడడం లేదు! ఎదుటి వ్యక్తి నుంచి ఆశించడం వల్ల చివరకు ఇలాంటి అధికారులందరూ అనర్థాలకు గురవుతున్నారు. ఎవరినుంచైనా ఏదైనా తీసుకొన్నప్పుడు దానికిగాను వారికి లొంగి, అణిగి మణిగి ఉండాల్సి వస్తుంది. ఒకనాటి అమెరికా అధ్యక్షుడు ఐసన్‌హవర్స్ కార్యదర్శి షెర్మన్ ఆడమ్స్ చాలా కార్యదక్షత గల వ్యక్తి. కానీ ఒక పారిశ్రామికవేత్త నుంచి టీషర్ట్ తీసుకొన్న కారణంగా ఆయన ఉద్యోగాన్ని కోల్పోయాడు. కారణం ఆ పారిశ్రామిక వేత్తకు ఈ కార్యదర్శి బానిస అయిపోవడమే.

అన్నీ నాకే ఉండాలనుకోవడం, వాటి వెంపర్లాటకై వేసే ప్రతీ అడుగు మనల్ని అస్వతంత్రులను చేస్తుంది. మానవత్వం గల మనిషిగా ఎదగాలి కానీ, ఎన్ని వస్తువులను కూడబెట్టామనేది కాదు. స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ, శ్రీరామకృష్ణ పరమహంస, బాలగంగాధర్ తిలక్ వీరందరికీ ఉన్నవి ఏమిటి? వీరిని గొప్పవారిగా చేసింది వారికి ఉన్న కారులా, భవనాలా, టీవీలా, సెల్‌ఫోన్లా మరి... వీరంతా మానవత్వం ఉన్న వారిగా ప్రసిద్ధులు. మూర్తీభవించిన ప్రేమ, కరుణ, దయ ఉన్న మహా మనుష్యులుగా ఎదిగారు. అంతకుమించి ఆతురత, ఆరాటం, చీకూ చింతా లేని వ్యక్తిత్వాలు వారివి.

'పాశ్చాత్యులు అధికంగా సంపాదించడం ద్వారా జీవిత సమస్యలకు పరిష్కారం వెదుకుతుంటే; భారతీయులు ఉన్న దానితో సంతృప్తిగా జీవించడంలోనే జీవిత సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటున్నారు' అంటారు స్వామి వివేకానంద.

మనిషి ఉన్నంతలో జీవిస్తూ ఉండడంలో ఉన్న ఆనందం దేనిలోనూ రాదు. మనిషి తనతో పాటు ఏమీ తీసుకువెళ్ళడని తెలుసుండికూడా ఎందుకు ఇంత తాపత్రయం. యక్షుడు ధర్మరాజును అద్భుతాలలో కెల్లా అద్భుతం ఏమిటి? అని అడిగినప్పుడు ధర్మరాజు ఈ విధంగా సమాధానం చెబుతాడు: "ప్రపంచంలో ప్రతీరోజు తన కళ్ళ ముందు ఎంతో మంది చనిపోతున్నప్పటికీ తాను కూడా ఏదో ఒక రోజు చనిపోతానన్న ఆలోచనే రాదు".

ధర్మరాజు తెలిపిన జీవిత సత్యాన్ని గుర్తుంచుకొని మానవతా విలువలతో కూడిన మనుష్యులుగా, ఉన్నదానితో సంతృప్తి చెందుతూ, ఆనందంగా జీవిద్దాం. ❖

స్వామి ప్రేమేశానంద
(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

బెరహమ్‌పూర్
11-4-1951

ప్రియమైన తల్లీ సుష్మా!*

మనస్సుకు సంబంధించిన సమస్యలన్నీ జనులందరికీ సమానమైనవే. మనస్సు అదుపు చేయలేనిది, చాలా అవిశ్రాంతమైనది. ఇంకా చెప్పాలంటే ఈ శరీరాలు బహు సున్నితమైనవి. అందుచేతనే భగవంతుడు మన కోసం ఓ అపూర్వమైన ఔషధాన్ని అందించాడు. అదే శ్రీరామకృష్ణ నామం, రూపం. ఆయన నామాన్ని జపం చేస్తూ, ఆయన రూపంపై ధ్యానిస్తే మన సమస్త రోగాలూ మటుమాయ మవుతాయి.

భగవద్గీతలోని నీకు ఇష్టమైన శ్లోకాలను గురించి వ్రాశావు. చాలా సంతోషం. నీ అభిరుచి చాలా గొప్పది. నీకు విజయం నిశ్చయం. అభిరుచి మంచిదైనప్పుడు ఆ వ్యక్తులు సహజంగానే మంచి వ్యక్తులవుతారు.

గురువు అనుగ్రహం వలన నీవు 'త్యాగి'వయ్యావు. ప్రాపంచికమైన దుమ్ము, ధూళిని విసిరిపారేసి రత్నాలను ప్రోగుచేసుకో తల్లీ! నీవు పనిచేస్తూ ఆ పనిలోనే పరమాత్మను దర్శించడం నేర్చుకోవాలి. ప్రతి ఒక్కరూ "జపం, ధ్యానం – జపం, ధ్యానం" అని పలుకుతుంటారు. కానీ నువ్వు దాన్ని గురించి బాగా ఆలోచిస్తే అవి అర్థం లేని మాటలని నీకే బోధ పడుతుంది. ఎందుకంటావా? నిరంతరం అవిచ్ఛిన్నంగా సాగే సాధన వల్ల జపం సహజసిద్ధంగానే అలవడుతుంది. అలా కానప్పుడు అది కేవలం అకారణంగా మెదడును వేడెక్కించడమే అవుతుంది. ఎంతోమంది మోసగాళ్ళు రోజంతా తాము త్రిప్పుతూ కూర్చొనే పూసలమాల గురించి చెబుతుంటారు. కానీ వారి స్వభావంలో మాత్రం మార్పు రాదు. అష్టాంగ సహితమైన యోగ మార్గంలో ధ్యానం అనేది ఏదో మెట్టు. దాని పైన సమాధి స్థితి. అదంతా చాలా తీవ్రమైన సాధనాపథం. కానీ సామాన్య వ్యక్తులు సైతం "జపం – ధ్యానం, జపం – ధ్యానం" అని వల్లిస్తుంటారు. వారి మెదళ్ళు వేడెక్కడం తప్ప ఫలితమేమైనా ఉంటుందా చెప్పు?

అసలు సంగతి ఏమిటంటే నువ్వు ఎవరి నామజపాన్ని చేస్తున్నావో ఆయన యొక్క గుణగణాలకూ, రూపానికీ ఆకర్షితమయ్యేలా నీ మనస్సుకు తర్ఫీదు నివ్వాలి. ఆయనను గురించిన నిరంతర ఆలోచనలో మనం బాహ్య ప్రపంచాన్నే మరచిపోవాలి. కానీ మనస్సులో బాల్చీల కొద్దీ బురద, దుమ్ము చేరి ఉన్నాయి. అర్థం లేని జపాన్ని గజస్నానంతో పోల్చవచ్చు. ఏనుగు స్నానం చేస్తుంది. మళ్ళీ తొండంతో తన నెత్తిన తానే దుమ్ము పోసుకుంటుంది. అలా కారాదు. అందరికీ సేవ చేస్తూండు. జీవసేవే శివారాధనగా భావించాలి తల్లీ! నిరంతరం కర్మ చెయ్యడం ద్వారా శారీరక, మానసిక సోమరితనాన్ని నిర్మూలించాలి తల్లీ! సుష్మా! అప్పుడు మనస్సు దానంతట అదే స్థిరత్వానికి వస్తుంది. ఇతరుల కొరకై పని చెయ్యని వ్యక్తి మనస్సు పవిత్రం కాదు సుమా! నీ విద్యార్థినులను దివ్యజనని ప్రతిరూపాలుగా, నీ సహోపాధ్యాయినులను శారదామాత రూపాలుగా భావిస్తూ పనిచేస్తుండు.

నీలో తొలగిపోవలసింది రవ్వంత మాత్రమే మిగిలి ఉంది. త్వరలోనే నీ మనోభ్రమరం అమ్మ శ్యామ పాదారవిందాలపై వాలుతుంది. నీవు ప్రపంచ వాసనల్ని వదలి చాలా ముందుకు సాగిపోయావు. వెనక్కు వెళ్ళేందుకు మార్గం లేదు తల్లీ! ముందుకు సాగిపో! తప్పక పురోగమిస్తావు. విచారం, భయం, సంశయం లాంటి వాటికి చోటివ్వకు. ❖

ప్రేమాశీస్సులతో...
స్వామి ప్రేమేశానంద

(*సుష్మ కాలాంతరంలో సన్న్యాసం స్వీకరించి ప్రవ్రాజిక అమియప్రాణా మాతాజీగా రూపొందారు)

తెలుగుసేత : కె. త్రివిక్రమరావు

www.rkmath.org Ramakrishna Math Hyderabad Free Soft Copy

అమరధామానికి సేతువు

...15వ పేజీ తరువాయి.

ఆశ్రయించారు, కనుక మునిగే అవకాశం తక్కువ. శ్రీరామకృష్ణులు సద్గురువును ఆశ్రయించమన్నారు.

ఘోర భవనీరనిధి, నామ నిజ నావరే అంటాడు తులసీదాసు. గురువు దత్తం చేసేది భగవన్నామం, కనుక అదే నావ, దానిని ఆశ్రయించి ఈ ఘోర సంసార సాగరాన్ని దాటవచ్చు. భగవంతుడే సత్యం, కనుక ఆయన నామం సత్యం– 'సత్ కీ నావ, కేవటియ సత్ గురు భవసాగర తర ఆయో' అంటారు మీరాబాయి. గురువు కర్ణధారి. ఆయన మార్గమెరుగును కనుక సత్యమనే నావను ఎక్కిస్తాడు.

నౌకను ఎక్కిన మాస్టరు, ఒక బ్రాహ్మణుడు జలరాశిపై నడవడం చూశారు. అదేమీ కష్టం కాదనీ, అడుగున వంతెన ఉన్నదనీ, తాను భవానీపురం వెళుతున్నాననీ చెప్పాడు బ్రాహ్మణుడు. నావ దిగేందుకు నీకు సమయం పడుతుంది. ఈ మార్గం గుర్తు పెట్టుకో అంటాడు. బ్రాహ్మణుడే శ్రీరామకృష్ణులు. భవానీ జగన్మాత. నిజానికి శ్రీరామకృష్ణులే జగన్మాత, జగత్పిత.

శ్రీరామకృష్ణులు తన జగన్నాటకాన్ని ముగించి, త్వరలో అభినిష్క్రమించనున్నారు. మాస్టర్ ఇంకా ఈ లోకంలో చేయవలసిన కర్మలున్నాయి. ప్రధానంగా శ్రీరామకృష్ణ కథామృతాన్ని రచించాల్సి ఉంది. కనుక ఈ మార్గం గుర్తు పెట్టుకో అన్నారు శ్రీరామకృష్ణులు. ఆ మార్గం – వారి బోధనలు, అవి మోక్షసాధనలు, వాటిని ఆచరిస్తే మోక్షం సులభసాధ్యం. జీవులు సంసారాన్ని తరించి అమరత్వాన్ని పొందేందుకు వంతెన లాంటి వాడు భగవంతుడు. 'అమృతస్య ఏష సేతుః' అన్నది ఉపనిషద్వాక్యం. ఆ వారధిని కనుగొని, దానిపై నడిస్తే, సంసారంలో మునిగిపోయే భయం ఇక ఉండదు. బ్రాహ్మణుడు చూపిన వారధి దేనితో నిర్మితమైంది? శ్రీరామకృష్ణుల చరణ ధూళితో!

'సంసార సాగరోత్తార సేతుభూత అంఘ్రిరేణవే' అన్నారు 'శ్రీరామకృష్ణ మంగళాష్టకం'లో! 'అంఘ్రి' అంటే పాదం; పాదరేణువులతో నిర్మితమైన సేతువు మన కోసం సిద్ధంగా ఉంది – అది సంసార సాగరాన్ని అవలీలగా దాటింపజేస్తుంది. ఒక చేత్తో సంసార కర్మలు నిర్వర్తిస్తూ మరొక చేత్తో భగవంతుని పాదపద్మాలు పట్టుకోమన్నారు శ్రీరామకృష్ణులు. శ్రీరామకృష్ణ నామం జపిస్తూ వారి కథామృతాన్ని మననం చేసి, ఆచరించే ప్రయత్నం చేస్తే, తప్పక అమృతసేతువు జాడ కనుగొనవచ్చు. ❖

శ్రీ రామకృష్ణ అద్వైత ఆశ్రమ

(హెడ్ క్వార్టర్స్: రామకృష్ణ మఠం & మిషన్, బేలూరు మఠం)

(పి.ఒ) కాలడి, ఎర్నాకుళమ్–683 574, ఫోన్ : 0484 – 2461071; 09447051231

విన్నపం

కాలడిలోని శ్రీరామకృష్ణ అద్వైత ఆశ్రమం 5వ తరగతి నుండి 10వ తరగతి వరకూ చదివే అనాథ, నిరుపేద పిల్లల కోసం 1936 నుండీ ఒక ఉచిత వసతి గృహాన్ని నడుపుతోంది. ఈ వసతి గృహం 100 మంది పిల్లలకు ఉచితంగా భోజన బస వసతులను సమకూరుస్తూ, విద్యావ్యాసంగానికి అవసరమైన పాఠ్య గ్రంథాలను అందిస్తోంది. వీటన్నిటి నిర్వహణ కోసం **రెండు కోట్ల రూపాయల శాశ్వత నిధిని** ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. భక్తులనూ, హితైషులనూ ఉదారంగా విరాళాలీయమని కోరుతున్నాం.

శాశ్వత నిధి కోసం వసతి గృహానికి ఇచ్చే ఈ విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని 35 ఎసి ప్రకారం **నూటికి నూరు శాతం పన్ను మినహాయింపు లభిస్తుంది.**

ఆశ్రమంలో నిర్వహించే నిత్యపూజ, ఉచిత వైద్యశాలలు, ఉత్సవ నిర్వహణ లాంటి ఇతర కార్యక్రమాలకై ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 (జి) ప్రకారం పన్ను మినహాయింపు లభిస్తుంది.

విరాళాల్ని Sri Ramakrishna Advaita Ashrama, Kalady పేరున చెక్కు/ డి.డి తీసి Sri Ramakrishna Advaita Ashrama, P.O. Kalady, Ernakulam-683 574 చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కాలడిలోని యూనియన్ బ్యాంక్‌లోని మా **అకౌంట్ నెంబర్ 338602010009164** (IFSC Code : UBIN0533866)కు నేరుగా కూడా పంపవచ్చు.

కృతజ్ఞతాభినందనలతో...

భగవత్సేవలో

స్వామి అమలేశానంద

అధ్యక్షులు

Advt.,

పెద్ద మనసు

– గుళ్ళపూడి శ్రీనివాసకుమార్

తమిళనాడులో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అక్కడి కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసే వాగ్దానం ఒకటుంది. ఎన్నికల్లో గెలిపిస్తే, తమిళనాడుకు ఒకప్పుడు గొప్ప ప్రజారంజక పాలన అందించిన "కామరాజ్ పాలనను మళ్ళీ ప్రజలకు అందిస్తాం" అని! దీనిని బట్టి ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కామరాజ్ నాడార్ ఎంతటి ప్రజాదరణ పొందిన నాయకుడన్నది అర్థం చేసుకోవచ్చు. ఆయన జీవితంలోని ఒక మధుర ఘట్టం ఇది:

అవి కామరాజ్ నాడార్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజులు. ఒకరోజు ఉదయం చాలామంది ఆయన ఇంటికి వచ్చి, ఆయనతో ముఖ్యమైన విషయాలు మాట్లాడి వెళుతున్నారు. అదే సమయంలో ఒక అమ్మాయి, అబ్బాయి ఆయన ఇంటి గుమ్మం వద్ద భయం భయంగా అటూ ఇటూ చూస్తూ నిలబడి ఉన్నారు. అబ్బాయి వయస్సు 12 ఏళ్ళు. అమ్మాయి వయస్సు 8 ఏళ్ళు. తలలపై తైల సంస్కారం లేని చింపిరి జుత్తు, మాసిన బట్టలు – ఇదీ ఆ పేద పిల్లల అవతారం.

అప్పుడే ఒక పెద్దమనిషి అక్కడికి వచ్చి "ఇక్కడ నిలబడవద్దు. వెళ్ళండవతలకి" అని ఆజ్ఞ జారీచేసి వెళ్ళిపోయాడు. ఆ చిన్నారులు భయపడి పక్కకి వెళ్ళిపోయారు. కానీ కాసేపటికి మళ్ళీ అక్కడికే వచ్చారు. అదే సమయంలో తన ఇంటికి వచ్చిన ఒక ప్రముఖుడిని సాగనంపేందుకు బయటకు వచ్చిన ముఖ్యమంత్రి కామరాజ్ ఆ పిల్లల్ని చూసి, "ఏం కావాలి మీకు?" అని అడిగి వారి చెంతకు వెళ్ళారు. ఆ పిల్లల ముఖంలో ఆనందం వెల్లివిరిసింది.

ఆ చిన్నపిల్ల కాస్త ధైర్యం తెచ్చుకుని "అన్నయ్యకు టైప్ పరీక్ష. అమ్మ ఏమో ఫీజు డబ్బులు ఇవ్వలేని పరిస్థితి..." అంది. ఆమె తన మాట పూర్తి చేస్తుండగా, కామరాజ్ ఆమె భుజంపై ప్రేమతో తట్టి "అమ్మ పంపిందా?" అని అడిగారు. "లేదు. మా అంతట మేమే వచ్చాం. అమ్మ రోజూ అప్పడాలు చేసి, అమ్ముకుని వస్తుంది. ఆ డబ్బుతోనే మమ్మల్ని చదివిస్తుంది" అన్నదా బాలిక.

ఇక కామరాజ్ ఆమెనేమీ చెప్పనివ్వలేదు. "అంబీ (కార్యదర్శి పేరు)! సత్యమూర్తి భవన్‌కి (కాంగ్రెస్ కార్యాలయం) ఫోన్ చేసి వెళ్ళయప్పన్‌ని పిలు. నేను మాట్లాడాలి" అని చెప్పారు. అంబి వెంటనే ఫోన్ చేసి ఆయనకు ఇవ్వబోయారు. ఈలోపున కామరాజ్ ఏమనుకున్నారో గానీ, "ఫోన్ చెయ్యవద్దులే" అనుకుంటూ మేడ మెట్లు ఎక్కి వేగంగా పైకి వెళ్ళారు.

ఈ మేడ ఎక్కడం, దిగడం కామరాజ్‌కు ఇబ్బందిగా అనిపించి, అప్పటికి కొన్ని రోజులుగా తన ఇంటి కింది భాగంలో ముందున్న గదిలోనే ఉంటున్నారు. ఇప్పుడు ఉన్న ఫళాన ఆయన వడివడిగా మేడ మెట్లెక్కడం అక్కడున్న వారికి ఆశ్చర్యం అనిపించింది. కాసేపయ్యాక ఆయన ఒక కవరుతో తిరిగి వచ్చారు. అందులో పది రూపాయల నోట్లు కొన్ని ఉన్నాయి.

"ఇదిగో అన్నయ్య పరీక్షకు డబ్బు కట్టు. అమ్మ మాట విని, చక్కటి పిల్లల్లా ఉండాలి. మంచిది" అని కామరాజ్ ఆ కవరును అమ్మాయి చేతికి ఇచ్చి పంపించారు.

మర్నాడు కామరాజ్ తన ఇంట్లో అంబితో మాట్లాడుతున్నారు. అప్పుడు ఆయన సహాయకుడు వైరవన్ వచ్చి "నిన్న వచ్చిన పిల్లలు మిమ్మల్ని మళ్లీ కలవాలట" అని చెప్పారు. లోపలకి పంపించమన్నారు కామరాజ్. ఆ అన్నాచెల్లెళ్ళిద్దరూ లోపలికి వచ్చి రసీదు ఆయనకు చూపించారు. "అయ్యా! పరీక్షకు డబ్బు కట్టేశాం. ఈ రసీదు మీకు చూపించమని అమ్మ చెప్పింది" అని చెప్పి ఆయన కాళ్ళకు నమస్కరించారు.

కామరాజ్ అమితానందంతో వారిని లేవనెత్తి ముద్దుగా భుజాలు తట్టి గుమ్మం వరకూ సాగనంపారు. "నిరుపేద పిల్లలు.. అబద్ధమాడరని అప్పుడే అనుకున్నాను... మంచి పిల్లలు" అంటూ తిరిగి లోపలికి వచ్చారు. అదీ కామరాజ్ పెద్ద మనస్సు. ❖



మహాభారత పాత్రల విశ్లేషణ



రచన: శ్రీమతి బొప్పన అరుణాదేవి
వెల రూ. 50/- , పేజీలు : 226
ప్రతులకు: మేనేజరు, శ్రీ వ్యాసాశ్రమము,
శ్రీ వ్యాసాశ్రమము (పోస్టు) 517 621
ఏర్పేడు (మండలం) చిత్తూరు జిల్లా.

'మహాభారతం వ్యాసభగవానుని అద్భుత సృష్టి, మహాభారతంలోలేనిది ప్రపంచంలో లేదు' అని ఆర్యోక్తి. నిజంగానే మహాభారతం (సంస్కృత భారతం మాత్రమే) ఒక విజ్ఞానఖని. దురదృష్టవశాత్తు తెలుగు అనువాదకులు వ్యాసవిరచిత మైన పాత్రకుండే గాంభీర్యాన్ని, ఔచిత్యాన్ని, తగ్గించి కొన్ని సందేహాలకు కారణమయ్యారు. అందులో ప్రధానమైనది ద్రౌపది పాత్ర. ముఖ్యంగా పాత్రల మానసిక సంఘర్షణలను విస్పష్టంగా విశదీకరించటంలో వ్యాసభగవానునిది అందెవేసిన చేయి. అటువంటి పాత్రలను స్వీకరించి, వాటిని సమగ్రంగా పరిశీలించి విశ్లేషించటం, హృదయానికి హత్తుకొనేలా ఆ భావాలకు అక్షరాకృతిని కల్పించటం కత్తిమీద సాములాంటిది. శ్రీమతి అరుణగారు ఔచిత్యభంగం లేకుండా, చాలా చక్కగా తమ కర్తవ్యాన్ని నిర్వహించారు. అందరూ తప్పక చదవవలసిన పుస్తకమిది. ❖

– ఎం.వి. నాగప్రసాద్

సుందర కాండము

(సంస్కృత మూల సహిత ఆంధ్ర తాత్పర్యము)



తాత్పర్యకర్త: శ్రీ భాగవతుల సుబ్రహ్మణ్యం
వెల రూ. 200/- పేజీలు: 648
ప్రతులకు: నవరత్న బుక్ హౌస్, 28-22-20,
రహిమాన్‌వీధి, అరండల్‌పేట,విజయవాడ- 2

రామాయణంలో హనుమంతుని పాత్ర ప్రధానమైనది. రామాయణంలోని 3000 శ్లోకాలు గల సుందరకాండలో హనుమంతునికి అమిత ప్రాధాన్యతను ఇచ్చాడు వాల్మీకి మహాముని. వాల్మీకి మహర్షి వ్రాసిన సుందరకాండ శ్లోకాలకి సరళమైన తెలుగులో తాత్పర్యం వ్రాసారు భాగవతుల వారు. సందర్భోచితమైన వ్యాఖ్యలు చేర్చి పారాయణ చేయడానికి వీలుగా ఆంధ్ర పాఠక లోకానికి అందించారు. ఈ గ్రంథాన్ని జాతక దోషాల నివారణ, గ్రహ బాధల నివారణ ఇంకా అనేక ఇతర దోష నివారణలకు "పారాయణ ప్రభావం ఫలితం" అనే శీర్షికలో ఇచ్చిన ప్రకారం ఆయా సర్గలను పారాయణ చేసి ఫలితం పొందవచ్చును. ఈ పుస్తకం కొని పారాయణం చేసిన భక్తులందరూ ఆ వాయుపుత్రుని అనుగ్రహం పొందగలరు. ❖

– శ్రీమతి ఎన్. శేషు

వేదాంత ప్రబోధం



శ్రీ స్వామి పరమానంద భారతీ
వెల రూ. 150/-, పేజీలు : 233
ప్రతులకు: రాగరాగిణి ట్రస్ట్
శ్రీ సచ్చిదానంద గణపతి ఆశ్రమం,
ఊటి రోడ్, మైసూరు – 570 025

తావచ్ఛాస్త్రాణి గర్జన్తి జంబుకా విపినే యథా ।
న గర్జతి మహాశక్తిః యావత్ వేదాన్త కేసరీ ॥

అన్నట్లు శంకర భగవత్పాదుల యొక్క ప్రస్థానత్రయ భాష్య రహస్యాలనన్నిటినీ ఒకచోట చేర్చి పాఠకులకు, జిజ్ఞాసు వులకు వేదాంత విషయాలను సులభతరం చేసి అందించారు శ్రీ పరమానందభారతీ స్వాములవారు.

ఈ వేదాంత ప్రబోధంలో పూజ్య స్వామీజీ అద్వైత సిద్ధాంతానికి సంబంధించిన అనేక విషయాలనూ, విచారణీ యాంశాలను సమర్థించే అనేక వాక్యాలనూ శంకరభాష్యాల నుండి ఉదాహరిస్తూ సుస్పష్టంగా ప్రతిపాదించారు.

వేదాంత శాస్త్ర విషయాలను సామాన్య పాఠకులకు పరిచయం చేస్తూ, నెమ్మది నెమ్మదిగా శాస్త్రంలోని లోతులను చూపించిన శ్రీ పరమానంద భారతీ స్వాములవారి రచనా నైపుణ్యం హర్షించ దగినది. ❖

హైందవి

(విశ్వమంతా విస్తరించిన భారతీయ సంస్కృతి)



రచయిత : ముదిగొండ ఇందుశేఖర్
వెల రూ. 300/-, పేజీలు : 116
ప్రతులకు: ఎం.ఎం. ఇందుశేఖర్
2-2-647/132 బి, సి-53, ఎక్సైజ్ కాలనీ,
హైదరాబాద్ – 500 013

శ్రీదేవి ఖడ్గమాల నామార్థ దీపిక

సంకలనకర్త, వ్యాఖ్యాత :
శ్రీమతి కురుగంటి శ్యామలాదేవి
వెల రూ. 40/-, పేజీలు : 168
ప్రతులకు: శ్రీ లలితా ధ్యాన మండలి
2వ లైను, భాగ్యనగర్, ఒంగోలు-523 001

వివేకానందునిపై పరిశోధనతో డాక్టరేట్!

– ఆత్మకూరు రమణయ్య

స్వామి వివేకానందపై పరిశోధన చేసిన ఆత్మకూరు రమణయ్య ఒక ప్రత్యేకమైన వ్యక్తి. ప్రపంచంలోని మహా తత్త్వవేత్త అయిన స్వామి వివేకానందుని జీవితాన్ని లోతుగా అధ్యయనం చేసి పరిశోధన గ్రంథం వెలువరించే దిశగా ఆయనను ప్రేరేపించిన శక్తి ఏమిటి? అది ఆయన మాటల్లోనే విందాం:

మాది నిరుపేద కుటుంబం. నేను నెల్లూరు జిల్లాలోని ఓ కుగ్రామంలో పుట్టాను. మా తాతయ్య పారిశుద్ధ్య కార్మికుడు. మా కుటుంబం అనుభవించిన పేదరికం అంతా ఇంతా కాదు. ఆ పరిస్థితుల వల్ల చిన్న వయస్సులోనే 1985లో చెన్నైలోని శ్రీరామకృష్ణ మఠంలో కావలి ఉద్యోగంలో చేరాను. తర్వాత తోట మాలిగా వికసించాను. తర్వాత మరింతగా కృషి చేసి ఒక్కో మెట్టూ ఎక్కుతూ వచ్చాను. మఠం వంటశాల, వైద్యశాల, తెలుగు, ఇంగ్లీషు పత్రికా విభాగాల్లో సేవలందించాను.

తమిళనాడు గవర్నర్ నుంచి
డాక్టరేట్ పట్టాను స్వీకరిస్తున్న రమణయ్య.

తెలుగు, ఇంగ్లీషు, తమిళ, సంస్కృత భాషల్లో టైపింగ్ చెయ్యడం నేర్చుకున్నాను. ఇంకా మఠం ప్రింటింగ్ ప్రెస్‌లో కంపోజింగ్, లే–అవుట్ ఆర్టిస్టుగా మరింత ముందుకెళ్ళాను. ఇలా గత పాతికేళ్ళ నుంచి చెన్నై, శ్రీరామకృష్ణ మఠంతో నా అనుబంధం కొనసాగుతూవుంది. అలా నేను, స్వామి వివేకానందుల తత్త్వబోధనలనే శ్వాసిస్తూ ఎదిగాను.

మఠంలోని స్వామీజీలు, పెద్దల ప్రోత్సాహంతో సార్వత్రిక విద్యావిధానం ద్వారా నా చదువు కొనసాగించాను. అదే పద్ధతిలో ఎం.ఏ. (తెలుగు) పూర్తి చేశాను. మఠంతో నిరంతర సాంగత్యం వల్ల స్వామీజీ తత్త్వబోధనలతో నా మనస్సు ఎంతో ప్రభావితమైంది. అదే నన్ను స్వామీజీపై పరిశోధనకు ప్రేరేపించింది.

పిహెచ్.డి. చేయాలంటే, అది వివేకానందుల జీవితాంశమే అయ్యుండాలని పట్టుదల కలిగింది. అలాగే మద్రాసు విశ్వవిద్యాలయంలో 'స్వామి వివేకానందుల మానవతావాదం' (Humanism of Swami Vivekananda) అనే అంశంపై పరిశోధన చేశాను. ఆ పరిశోధనకు మద్రాసు విశ్వ విద్యాలయం 16-9-09న డాక్టరేట్ పట్టాను ప్రకటించింది.

"All power is within you; you can do anything and everything... You are the creator of your own destiny" – ఎందరినో మహోన్నతులను చేసిన ఈ స్వామీజీ సందేశమే నాకు స్ఫూర్తిదాయకమైంది.

స్వామి వివేకానంద ఉద్దేశంలో వ్యక్తిత్వానికి అర్థం అంగబలమో లేక అధికార బలమో కాదు. ప్రతి ఒక్కరిలో సహజ సిద్ధంగా ఆవిష్కృతమై ఉండే ఆత్మబలం ఒక్కటే అసలైన వ్యక్తిత్వానికి విశిష్టతను చేకూరుస్తుందని ఆయన విశ్వసించారు. ఆ విశ్వాసమే ఆయన్ని విశ్వవేదికపై విలక్షణ వక్తగా నిలబెట్టింది.

"ఏదైనా మంచి లక్ష్యాన్ని ఎంచుకుని, దాని కోసమే జీవిస్తూ, దాన్ని సాధించేందుకు కృషి చెయ్యాలి. అవసరమైతే లక్ష్యం కోసం ప్రాణ త్యాగానికి వెనుకాడరాదు" అనేది స్వామీజీ సూక్తి. ఇలాంటి అత్యున్నత ఆశయాలతో జీవించేవారు స్వల్ప కాలంలోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరనడానికి స్వామీజీ జీవితమే నిదర్శనం.

అందరూ తమంత తాముగా స్వీయ పరివర్తన చెందడం ద్వారా నీతి, ధర్మం, ఆధ్యాత్మిక విలువలతో సమాజం వెలిగినప్పుడే ప్రపంచం అన్ని రంగాల్లోనూ సమానంగా పురోగతి సాధిస్తుంది. ఈ మార్గంలో పరిపూర్ణ మానవులను రూపొందించే ఉన్నత విధానాలు స్వామి వివేకానందుల వేదాంత సూక్తుల్లో అపరిమితంగా ఉన్నాయి.

సాధ్యమైనంత వరకు ఆ బాటలో పయనించాలన్నదే నా తపన. ఆ మార్గంలో వెళ్ళిన వారందరూ జీవితంలో పైకి ఎదుగుతారనడంలో సందేహం లేదు. ❖

(ఆత్మకూరు రమణయ్య, శ్రీరామకృష్ణ మఠం, చెన్నై)

రామకృష్ణ మఠం & మిషన్

రిమ్స్ ఆసుపత్రి దగ్గర, కడప - 516 002. ఫోన్: 08562-200120, 200633
నగర కేంద్రం: రామకృష్ణ మఠం, ట్రంకు రోడ్డు, కడప - 516 001. ఫోన్: 08562-241633
Email : kadapamath@yahoo.com, website : www.rkm-kadapa.org

విన్నపం

మూర్తిత్రయం యొక్క అపారమైన కృప, భక్తులు, హితైషుల సహాయ సహకారాలతో కడపలోని రామకృష్ణ మిషన్ నాలుగేళ్ళలోనే చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించింది. ప్రస్తుతం కడప శివార్లలో పాలకొండల వద్దనున్న రిమ్స్ ఆసుపత్రి దగ్గర ఉన్న 10 ఎకరాల అత్యంత ఆకర్షణీయమైన ఆవరణలో సేవా కార్యకలాపాలను నిర్వహిస్తోంది.

ముఖ్యమైన కార్యకలాపాలు:

1. ముప్పై మంది బాలురున్న ఉచిత వసతిగృహం.
2. కార్యాలయం, గ్రంథాలయం, పుస్తక విక్రయశాల.
3. వివేకానంద విద్యానికేతన్ ప్రాథమిక పాఠశాల.
4. విలువలతో కూడిన విద్యా కార్యక్రమం-విద్యా (VIDYA).
5. వ్యావసాయిక శిక్షణా కార్యక్రమాలు.
6. స్పోకెన్ ఇంగ్లీష్ కోర్స్. 7. నారాయణ సేవ.

వీటితో పాటు నిత్యం పూజ, భజనలు, ప్రవచనాలు, ఆధ్యాత్మిక అంతర్యోగం, ఉచిత పఠనాలయం, ఉచిత హోమియో చికిత్స (వారానికి ఒకమారు) లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ మధ్య కర్నూలు జిల్లాలో వరద బాధితులకు సేవా సహాయక చర్యలను మిషన్ చేపట్టింది.

భక్తులు ఎంతగానో ఎదురుచూస్తున్న భగవాన్ శ్రీరామకృష్ణుల విశ్వజనీన దేవాలయానికి 2009 సెప్టెంబర్ 6న రామకృష్ణ మఠం, మిషన్ల ఉపాధ్యక్షులు శ్రీమత్ స్వామి స్మరణానందజీ మహరాజ్ శంకుస్థాపన చేశారు. వీలైనంత త్వరలో సుందరమైన, విశాలమైన ఆలయ నిర్మాణం కావించడానికి మీ అందరి సహాయ సహకారాల్ని కోరుతున్నాం. పాఠశాల భవనానికి ఉపకరణాలు, వాహనాలు (స్కూలు బస్సు మొదలైనవి) సమకూర్చడానికీ, వివిధ విద్యా కార్యక్రమాల నిర్వహణకు శాశ్వత నిధిని ఏర్పాటు చేయడానికీ సంకల్పించాం. ఈ క్రింద సూచించిన పథకాల నిర్వహణ కోసం భక్తులు,శ్రేయోభిలాషుల నుండి విరాళాల్ని కోరుతున్నాం.

నూతన భగవాన్ శ్రీరామకృష్ణ దేవాలయ నమూనా

★ శ్రీరామకృష్ణుల విశ్వజనీన దేవాలయం- రూ. 140 లక్షలు
★స్కూలు ఫర్నీచర్,ఎక్విప్‌మెంట్, 2 బస్సులు-రూ. 25 లక్షలు
★ విద్యాసంస్థల నిర్వహణకై శాశ్వతనిధి- రూ. 100 లక్షలు

విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 (జి) కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. Ramakrishna Mission, Kadapa పేరిట చెక్కు కానీ, డి.డి. కానీ తీసి Ramakrishna Mission, Near RIMS Hospital, Kadapa-516 002 చిరునామాకు పంపగలరు.

భగవత్సేవలో
స్వామి ఆత్మవిదానంద
కార్యదర్శి

Advt.,



ఆపాల్సిన పరుగుపందెం

– స్వామి రంగనాథానంద

యం సన్న్యాసమితి ప్రాహుఃయోగం తం విద్ధి పాణ్డవ ।
న హ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన ॥ *(గీత-6.2)*

'యం సన్న్యాస మితిప్రాహుః యోగం తం విద్ధి పాణ్డవ' – దేన్నైతే సన్న్యాసమని అంటున్నామో, అదే యోగం. ఆధ్యాత్మిక భాషలో 'యోగం' అంటాం. యోగి అంటే సంకల్పాలను వదిలినవాడు.



'న హి అసన్న్యస్త సంకల్పో' – బాహ్యంగా అవీ ఇవీ కావాలని కోరుకోవడాన్నే సంకల్పం అంటాం. కోర్కెలు అన్నీ సంకల్పం నుంచే ఉద్భవిస్తాయి. సంకల్పాలను పద్ధతిగా అదుపులో పెట్టుకోకుంటే వాటికి మనం బానిసలం కాక తప్పదు. సంకల్పాలు అవీ ఇవీ చెయ్యమని ప్రోత్సహిస్తాయి. దానితో వ్యక్తి కోర్కెల వలయంలో చిక్కుకొని, వాటిని తీర్చుకోవడానికి కృషి చేస్తుంటాడు. ఈ విధంగా మనిషి ఎన్నటికీ పరిపూర్ణతను సాధించలేడు.

నాగరక ప్రపంచంలో వస్తుసేకరణ కోసం శక్తినంతటినీ వినియోగిస్తున్నారు. అది సరైన విధానం కాదు. మానవులు ఉన్నతమైన స్థితికి చేరుకోవాలన్న సంగతి చాలామంది శాస్త్రవేత్తలు వ్రాస్తున్నారు. చాలా పుస్తకాలు వస్తున్నాయి. మానవ జీవితంలో ఆ స్థితిని సంకల్ప నిరోధం వల్ల పొందగలం. కానీ ప్రపంచంలో వస్తుసేకరణ తత్త్వం విపరీతంగా పెరిగిపోతోందని అమెరికా వారి పరిశీలనలో తెలుస్తోంది. ఎంతసేపటికీ మనిషి కోరికల వెంట పరిగెడుతూ మానవత్వాన్ని నశింపజేసుకుంటున్నాడు. ఏ విధంగా దీన్ని పరిశీలించి బయటపడాలన్న అంశం పైన ఆధునిక ప్రపంచంలో చర్చలు జరుగుతున్నాయి. వేదాంతం ఈ విషయాన్ని చాలా కాలం క్రితమే యోచించి, మార్గం చూపించింది.

అవసరాలు, సంతోషాలు తీర్చుకోవద్దని వేదాంతం చెప్పడం లేదు. ఒక స్థాయికి వచ్చాక వాటి మీద దృష్టి ఉంచి యోచించమంటోంది. వస్తువుల వెంట పరుగెత్తడం 'ప్రవృత్తి'. దానిని నిరోధించుకోవడం 'నివృత్తి'. 'నాకు వద్దు, నాకు వద్దు' అనుకోవాల్సింది పోయి, టీవీ ప్రకటనల వల్ల, బుద్ధి నశించి చూసినవన్నీ 'నాకు కావాలి, నాకు కావాలి' అంటున్నాం. ఇతర దేశాల్లో మేధావులు ఈ ప్రకటనలకు వ్యతిరేకతను చూపుతున్నారు. ఈ ప్రచారాలకు డబ్బు ఖర్చు ఎక్కువ అవుతుంటుంది. అది అంతా మనమే చెల్లిస్తున్నామన్న సంగతి మనకు తెలియదు. దీనివల్ల వస్తువులను నిర్ణయించుకొనే స్వేచ్ఛ కూడా నశిస్తుంది. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారంగా మానవుణ్ణి ఉన్నతమైన విలువల వైపు మళ్ళించడం అవసరం. సంగీతం, కళలు, నీతి, నియమాలు, ఆధ్యాత్మికత – ఇవన్నీ మన సంస్కృతిపరంగా మనకు వారసత్వంగా వస్తున్నాయి. వీటిని నిర్లక్ష్యం చెయ్యకుండా సొంతం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ❖

(స్వామి రంగనాథానందజీ 'గీతోపన్యాసాల' నుంచి)

సేకరణ : ఆర్.కృష్ణ

With Best Compliments From

PENNAR INDUSTRIES LIMITED

305, Saptagiri Towers, Begumpet, Hyderabad - 500 016

పెన్నార్ కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

9 యుద్ధంలో పద్మాక్షుణ్ణి రావణుడు చంపేశాడు. రావణుడికి పట్టుబడకుండా పద్మాక్షి తప్పించుకోవడంతో కుపితుడైన రావణుడు ఆ నగరాన్ని దహించివేశాడు. ఆమెను వెతుక్కుంటూ పుష్పక విమానంలో వచ్చిన రావణుడు బూడిదను ఎగదోస్తుండగా పద్మాక్షి కనబడింది.



శ్రీహరిని ప్రార్థించి పద్మాక్షి అగ్నిప్రవేశం చేసింది. ఆ అగ్నికుండాన్ని రావణుడు అటూ ఇటూ కుదిపి చూసినప్పుడు అతనికి ఒక మాణిక్యం దొరికింది. దాన్ని బంగారుపేటికలో ఉంచి లంకకు తీసుకెళ్ళాడు.



ఆ పేటికను తెరచినప్పుడు అందులో మాణిక్యానికి బదులుగా ఒక అందమైన పాపాయి ఉంది.



వెంటనే శాంతించిన రావణుడు పాపను పేటికలో ఉంచి దానిని మిథిలా నగరంలో ఒకచోట పాతి పెట్టాడు.

13 జనకమహారాజు సంతానం కోసం పుత్రకామేష్టి యాగం చేస్తూ ఒక బ్రాహ్మణుడి పొలాన్ని బంగారు నాగలితో దున్నుతున్నాడు. అప్పుడు నాగలి కొనకు ఏదో అడ్డుపడి శబ్దం వచ్చింది.



14 అప్పుడు జనకుడు అక్కడ త్రవ్వి చూస్తే రావణుడు పాతిపెట్టిన పేటిక దొరికింది.



15 జనకుడూ, బ్రాహ్మణుడూ తగవును పరిష్కరించాల్సిందిగా రాజగురువైన సదానందుని ఆశ్రయించారు.



16 పేటికను తెరచి అందులో ఉన్న బిడ్డను చూచి....

అయస్కాంతం ముల్లు ఎల్లప్పుడూ ఉత్తర దిక్కునే సూచిస్తూ ఉంటుంది. అందువల్ల ఓడలు దిశ తప్పలేవు. అలాగే మనుజుని మనస్సు ఎల్లప్పుడూ భగవంతుని వైపే ఉంటే సంసార సాగరంలో అది మునిగిపోజాలదు.

– శ్రీరామకృష్ణ పరమహంస

వరద బాధితులకు మగ్గాల పంపిణీ

2009 అక్టోబర్ నెలలో వరదలకు గురైన మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజోలి గ్రామంలో చేనేత కార్మికుల కుటుంబాలకు **హైదరాబాద్ రామకృష్ణ మఠం** జనవరి 10 తేదీన 300 మగ్గాలను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. దమయంతి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ జి. శ్రీధరబాబు, స్థానిక ఎమ్.ఎల్.ఏ. శ్రీ అబ్రహమ్, ఆర్.డి.వో. అశోక్ కుమార్ పాల్గొని రామకృష్ణ మఠం చేస్తున్న సేవలను కొనియాడారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామి అనుపమానందజీ, స్వామి గౌరంగానందజీలు తమ ప్రసంగాల్లో 'మానవ సేవే-మాధవసేవ' అన్న స్వామి వివేకానందుని సందేశ ప్రాముఖ్యతను వివరించారు. ❖



నివేదిక : స్వామి శితికంఠానంద

జాతీయ యువజన దినోత్సవం

హైదరాబాద్ రామకృష్ణ మఠం జనవరి 12న జాతీయ యువజన దినోత్సవం (స్వామి వివేకానంద జన్మదినం-ఆంగ్ల క్యాలండర్ ప్రకారం), వివేకానంద వాణీసంస్థ 28వ స్నాతకోత్సవాలను నిర్వహించింది. సుమారు 1100 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఏ.పి. స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ జె. రాంబాబు, ఐ.ఏ.ఎస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా 'డాక్టర్ కె.ఆర్. నారాయణన్, శ్రీమతి కౌసల్యా నారాయణన్ స్మారక బంగారు పతకం' ఇన్‌స్టిట్యూట్ ఉత్తమ విద్యార్థిని స్నేహా చౌదరికి రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి జ్ఞానదానందజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ జె. రాంబాబు, స్వామి జ్ఞానదానందజీ, స్వామి శ్రీకాంతానందజీ మాట్లాడుతూ నేటి యువ తరానికి 'స్వామి వివేకానంద సందేశ ఆవశ్యకత' గురించి వివరించారు. ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు వివేకానంద సందేశంపై గోష్ఠి, సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహించారు. ❖

నివేదిక : స్వామి అనుపమానంద

వ్యక్తిత్వ వికాస సదస్సులు

తూర్పుగోదావరి జిల్లా **వేట్లపాలెం శ్రీరామకృష్ణ సేవాసమితి** ఆధ్వర్యంలో హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామీజీలు అనుపమానందజీ, రఘునాయకానందజీ జనవరి 29,30వ తేదీల్లో దవిలి, కైట్ ఇంజనీరింగ్ కళాశాల; ప్రత్తిపాడు, మినర్వా డిగ్రీ కళాశాల; పెద్దాపురం, ఆదిత్య, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సుల్లో సుమారు 3000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జనవరి 31వ తేదీన సమితిలో భక్తులకు సాధనా కార్యక్రమం కూడా నిర్వహించారు. ❖

నివేదిక: కె.గోపాలకృష్ణ

జాతీయస్థాయిలో చిత్రలేఖన పోటీలు

చెన్నై, శ్రీరామకృష్ణ మఠం ప్రచురిస్తున్న తమిళ మాసపత్రిక శ్రీరామకృష్ణ విజయం జాతీయస్థాయిలో చిత్రలేఖన పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 30,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి– జె.విజయ్ కుమార్, పుదుకొట్టై, తమిళనాడు; ద్వితీయ బహుమతి– శివకుమార్ మాల్వియ, హోషంగాబాద్, మధ్యప్రదేశ్; కె. మైఖేల్, ఇంఫాల్, మణిపూర్; ఎమ్. విశాలాక్షి, విల్లుపురం, తమిళనాడు; బి.సాయినాథ్ చెన్నై; ఫిరోజ్ కుమార్, జార్ఖండ్; తృతీయ బహుమతి– సి. సతీష్ ఈరోడ్, తమిళనాడు; టి. బాలసుబ్రహ్మణ్యన్ తిరునల్‌వేలి, ఎమ్.గజానన్, పర్భని, మహారాష్ట్ర; ఎన్. సిద్ధార్థ మానిక్‌రావ్, పర్భని, మహారాష్ట్ర గెలుచుకున్నారు. 'జాతీయ యువజన దినోత్సవం' సందర్భంగా జనవరి 12వ తేదీన నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి గౌతమానందజీ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమానికి మద్రాసు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జి. తిరువాసగమ్, డి.జి.పి. శ్రీ ఆర్ నటరాజ్ ఐ.పి.ఎస్, ప్రముఖ పత్రికా రచయిత శ్రీ గురుమూర్తి పాల్గొన్నారు. ❖ నివేదిక : స్వామి విమూర్తానంద

పేద విద్యార్థులకు ఉచిత వసతి గృహం

విజయవాడ రామకృష్ణ మిషన్ సీతానగరంలో రామకృష్ణ మిషన్ ఉన్నత పాఠశాలను (6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు – తెలుగు మాధ్యమం) నిర్వహించడంతో పాటు పేద విద్యార్థుల కోసం ఉచిత వసతి గృహం కూడా నిర్వహిస్తోంది.

ఈ వసతి గృహంలో 5వ తరగతి ఉత్తీర్ణులై 6వ తరగతిలో చేరే బాలురకు మాత్రమే ప్రవేశం లభిస్తుంది. ప్రవేశం పొందగోరే వారు 9''×6'' సైజు సొంత చిరునామా వ్రాసిన కవరును (తగిన స్టాంపులు అంటించి) **2010 ఏప్రిల్ 9వ తేదీ** లోగా ఈ క్రింది చిరునామాకు పంపి దరఖాస్తులను పొందవచ్చును.

దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేసిన విద్యార్థులకు మే నెల రెండవ వారంలో వ్రాతపరీక్ష నిర్వహించబడుతుంది. ప్రవేశ పరీక్ష 5వ తరగతి పాఠ్యాంశాలపై ఉంటుంది.

ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి సీతానగరం రామకృష్ణ మిషన్ ఉన్నత పాఠశాలలోనూ, ఉచిత వసతి గృహంలోనూ ప్రవేశం కల్పించబడుతుంది.

పూర్తి వివరాలకు సంప్రతించాల్సిన చిరునామా :

కార్యదర్శి,
రామకృష్ణ మిషన్,
సీతానగరం,
తాడేపల్లి (పోస్ట్ & మండలం)
గుంటూరు జిల్లా–522 501

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము

యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.

వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య

స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము

యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.

వయస్సు : 15 సం॥, ఆ పైన

స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము – వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)

కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము

అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవము : 2 సంవత్సరములు

సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)

విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత

అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము

అనుభవార్హత : 5 సం॥

సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 – 10 – 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ – 500 020** (ఫోను: 040 – 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/–

హైదరాబాద్ కులప్రశాసకుడు

Sponsored by:

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

సుబోధ

భగవదారాధనను గురించి గురుదేవులు ఒకప్పుడు కేశవచంద్రసేన్‌తోనూ, అతడి అనుచరులతోనూ ఇలా అన్నారు: "భగవంతుడి వైభవాన్నీ, ఆయన శక్తులనూ మీరంతగా స్తోత్రిస్తారెందుకు? తండ్రి వద్ద బిడ్డ, 'మా నాన్నకి ఇన్ని ఇళ్ళు, వాకిళ్ళు ఉన్నాయి, ఇన్ని గుఱ్ఱాలున్నాయి, ఇన్ని ఆవులున్నాయి, ఇన్ని తోటలున్నాయి' అని తలపోస్తాడా? లేక తన మీద తండ్రి కెంత గాఢానురాగం ఉందో, తననెంత మక్కువతో చూస్తాడో అని తలపోస్తాడా? తండ్రి తన బిడ్డలకు అన్న వస్త్రాలిచ్చి పోషించి వారిని సుఖపెట్టటం అబ్బురమా? మనమందరం ఆయన బిడ్డలం కాదా? మన యోగక్షేమాలను ఆయన ప్రేమతో చూసుకోవడంలో ఆశ్చర్యం ఏముంది? కాబట్టి నిజమైన భక్తుడు ఆయన వైభవాన్ని గురించి ఆలోచించడానికి బదులు ఆయనతో

సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకొని, ఆం
తనవాణ్ణిగా చేసుకొంటాడు, తన ముద్దు చెల్లించ
పట్టుబడతాడు, 'భగవంతుడు నా వాడు' అని గర్వి
'నాకు నువ్వు సాక్షాత్కరించక తప్పదు' అని నిర్బంధి
ఆయన వైభవాన్ని గురించి, ఆయన విభూతులను గు
మీరంతగా ఆలోచిస్తున్న పక్షంలో ఆయనను
సన్నిహితుడిగా, ఆప్తుడిగా భావించలేరు. మీ
తీర్చాల్సిందిగా ఆయనను నిర్బంధించ లేరు,
బట్టలేరు. అప్పుడు 'భగవంతుడెంత మహి
న్వితుడో! ఎంత అతీతుడో!' లాంటి భావాల
తలపులకు వస్తాయి. భగవంతుణ్ణి వీలైనంత
ఆప్తుడిగా భావించండి. అప్పుడు మీరు ఆయనను
చేసుకోగలరు." ❖

(శ్రీరామకృష్ణ బోధామృతం నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ,
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్-500 029
ఫోన్: 040-2766 7799, 2763 3936; E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

No. 1120/57. Postal Registration No. HD-1071/2010-12. Licensed to Post Under WPP : CPMG/AP/HC-13/WPP/2010-12.

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation inwardly, and by work done in a spirit of service outwardly."

- Swami Ranganathananda



With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

SVIS LABS LIMITED

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex,Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net
Web Site : www.svisslabss.net

TÜV | TÜV CERT
DIN EN ISO 9001 : 2000
Certificate : 01 100 058568

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.